పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

దిన పత్రిక

సంపుటి : 1 సంచిక : 728 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ శనివారం 26.09.2026 పేజీలు : 8 వెల : 4/-

### ఏపీలో పెట్టుబడులకు

## ఇదే మంచి ఛాన్స్: లోకేశ్



- అహ్మదాబాద్‌లో ఫార్మా రంగ ప్రతినిధులతో మంత్రి లోకేశ్ సమావేశం
- నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానం
- క్లస్టర్ మోడల్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తమ ప్రభుత్వ ప్రత్యేకత అని స్పష్టం
- సమావేశంలో పాల్గొన్న పలు ప్రముఖ ఫార్మా కంపెనీల అధినేతలు

ఆంధ్రప్రదేశ్‌ను ఫార్మాస్యూటికల్ రంగంలో కీలక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా, పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ తరువాయి 2లో

### రూ.లక్ష కోట్లతో

## సీమ హార్టీకల్చర్ హబ్

**రాయలసీమను గ్లోబల్ ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం శ్రీకారం**

- రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో 201 క్లస్టర్లలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు
- అక్టోబర్ 2న మదనపల్లెలో ప్రాజెక్టును ప్రారంభించనున్న చంద్రబాబు
- ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో సీమ ఆర్థిక స్వరూపం మార్పు లక్ష్యం
- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై సమీక్ష



2లో



### గంగమ్మ ఒడికి

## ఖైరతాబాద్ బడా గణేష్

- హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి
- 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం
- క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం
- పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక

హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర తరువాయి 2లో

### బ్రహ్మోస్ దెబ్బకు

## పాక్‌కు నిద్ర కరవు

- అమేథీ ఏకే-203 రైఫిళ్లు నక్సలైట్లను వణికిస్తున్నాయన్న అమిత్ షా
- నేరాల అడ్డా నుంచి రక్షణ ఉత్పత్తుల కేంద్రంగా మారిన యూపీ
- భారత్ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.లక్ష కోట్లు దాటింది
- దాదాపు 80 దేశాలకు రక్షణ పరికరాలు ఎగుమతి చేస్తున్న భారత్

2లో



## ఐఐటీల్లో పెరుగుతున్న మరణాలు

### పదేళ్లలో డబుల్

- ఐఐటీల్లో 20 ఏళ్లలో 171 మంది విద్యార్థులు మృతి
- 2016 తర్వాత 120 మరణాలు నమోదు
- ఖరగ్‌పూర్ ఐఐటీలో అత్యధికంగా 29 మంది మృతి
- గత ఐదేళ్లలో 74 మంది విద్యార్థులు మృతి
- 2025లో అత్యధికంగా 16 మరణాలు నమోదు
- 2026లో సెప్టెంబర్ 18 నాటికే 13 మంది మృతి



ఐఐటీ.. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఒకటి. ఇక్కడ సీటు కోసం విద్యార్థులు ఏళ్ల తరబడి కష్టపడతారు. కానీ అదే క్యాంపస్‌లలో విద్యార్థుల ఆత్మహత్యలు, అసహజ మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2006 నుంచి 2026 సెప్టెంబర్ తరువాయి 2లో

### ఖరీదైన ఇళ్లలో బెంగళూరు టాప్..

## హైదరాబాద్ నాలుగో ర్యాంక్

- రూ. 2 కోట్ల నుంచి రూ.5 కోట్ల ఇళ్ల అమ్మకాల్లో బెంగళూరు దేశంలోనే టాప్
- అమ్మకాల విలువలో ఎన్‌సీఆర్, ముంబైలను అధిగమించిన సిలికాన్ సిటీ
- జాబితాలో నాలుగో స్థానంలో నిలిచిన హైదరాబాద్
- దేశంలో ఖరీదైన ఇళ్ల కొనుగోళ్లు పెరుగుతున్నాయని స్పష్టం చేసిన నివేదికలు



దేశంలో ఖరీదైన ఇళ్ల మార్కెట్‌లో బెంగళూరు నగరం సరికొత్త రికార్డు సృష్టించింది. 2026 ప్రథమార్థంలో (జనవరిజూన్) రూ. 2 కోట్ల నుంచి రూ. 5 కోట్ల మధ్య ధర కలిగిన నివాస గృహాల విక్రయాల్లో బెంగళూరు అగ్రస్థానంలో నిలిచింది. ఈ విభాగంలో దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్), ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లను సైతం బెంగళూరు అధిగమించింది. ప్రముఖ రియల్ ఎస్టేట్ అనలిటిక్స్ తరువాయి 2లో



### దీన్‌దయాళ్ బాటలోనే

## వికసిత్ భారత్: మోదీ

- దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా మోదీ నివాళి
- వ్యక్తి ప్రగతి సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంతమని వెల్లడి
- అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనేదే అంత్యోదయ లక్ష్యమని వ్యాఖ్య

స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథాన్ని అందించిన మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తే బీజేపీకి, తమ ప్రభుత్వాల నిర్ణయాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. వ్యక్తి ప్రగతి సమాజం 2లో

### భారత్ భయంతో దావూద్‌కు

## ఐఎస్ఐ కొత్త రక్షణ

- దావూద్ ఇబ్రహీం విషయంలో పాక్ ఐఎస్ఐ వ్యూహం మార్పు
- భారత్ ఆపరేషన్ భయంతో కరాచీ పోర్టు సమీపంలోకి నివాసం
- మాదకద్రవ్యాల వ్యాపారం కంటే దావూద్ రక్షణకే అధిక ప్రాధాన్యం
- డీ-కంపెనీలో అనారోగ్యం, వారసత్వ పోరుతో అంతర్గత సంక్షోభం

2లో



# ఏపీలో పెట్టుబడులకు ఇదే మంచి ఛాన్స్: లోకేశ్

ఆంధ్రప్రదేశ్‌ను ఫార్మాస్యూటికల్ రంగంలో కీలక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా, పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ అహ్మదాబాద్‌లో పర్యటించారు. సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2026లో భాగంగా, ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఈడీబీ) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఫార్మా రంగంపై రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా, ఫార్మా రంగంలో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను ఆయన ఆహ్వానించారు. "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మా ప్రభుత్వ ప్రత్యేకత" అని మంత్రి స్పష్టం చేశారు. 2030 నాటికి భారత ఫార్మా మార్కెట్ 130 బిలియన్ డాలర్లకు చేరనుండగా, ఈ అభివృద్ధిలో ఏపీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రస్తుతం దేశంలోనే మూడో అతి పెద్ద ఔషధ ఎగుమతిదారుగా రాష్ట్రం నిలిచిందని లోకేశ్ వివరించారు. 11.05 బిలియన్ డాలర్ల విలువతో భారత ఫార్మా రంగంలో టాప్5 రాష్ట్రాల్లో ఏపీ ఒకటిగా ఉందని గణాంకాలతో సహా తెలిపారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ప్రభుత్వం 2,000 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ గురించి మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. "విస్తారమైన భూమి, పోర్టుకు సమీపంగా ఉండటం, తక్కువ నిర్వహణ వ్యయాలు, బలమైన ఫార్మా ఎకోసిస్టమ్‌తో పాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రాయితీలు కల్పిస్తున్నాం. మొదటి దశ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ అవకాశాన్ని వదులుకోవద్దు.. సద్వినియోగం చేసుకోవాలి" అని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. నక్కపల్లితో పాటు అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం, నెల్లూరు, విజయనగరం జిల్లాల్లో క్లస్టర్ మోడల్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు.



విశాఖపట్నంలోని మెడికల్ టెక్నాలజీ పార్క్ (ఏఎంటీజడ్), రాష్ట్రంలోని 6 ఆపరేషనల్ పోర్టులు, రాబోయే 4 గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు ఫార్మా రంగానికి మరింత ఊతమిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కీలక సమావేశంలో ఇండియన్ డ్రగ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐడీఎంఏ) జాతీయ అధ్యక్షుడు విరంచి షా, జైడస్ గ్రూప్, క్యాడిలా ఫార్మాస్యూటికల్స్, ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్ వంటి ప్రముఖ సంస్థల ఛైర్మన్లు, ప్రతినిధులు పాల్గొన్నారు. వీరితో పాటు స్వర్ణిమ్ స్టార్టప్ అండ్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ప్రతినిధులు, సీఎస్ఐఆర్ శాస్త్రవేత్తలు కూడా హాజరయ్యారు.

# బ్రహ్మోస్ దెబ్బకు పాక్‌కు నిద్ర కరవు

దేశంలో ఖరీదైన ఇళ్ల మార్కెట్‌లో బెంగళూరు నగరం సరికొత్త రికార్డు సృష్టించింది. 2026 ప్రథమార్ధంలో (జనవరిజూన్) రూ. 2 కోట్ల నుంచి రూ. 5 కోట్ల మధ్య ధర కలిగిన నివాస గృహాల విక్రయాల్లో బెంగళూరు అగ్రస్థానంలో నిలిచింది. ఈ విభాగంలో దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్), ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లను సైతం బెంగళూరు అధిగమించింది. ప్రముఖ రియల్ ఎస్టేట్ అనలిటిక్స్ సంస్థ 'క్రెమ్యాట్రిక్స్' తన తాజా నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. నివేదిక ప్రకారం, ఈ ఆరు నెలల కాలంలో బెంగళూరులో రూ. 31,216 కోట్ల విలువైన 11,556 ఇళ్లు అమ్ముడయ్యాయి. ఇదే సమయంలో ఎన్‌సీఆర్‌లో రూ. 27,125 కోట్లు, ముంబైలో రూ. 21,952 కోట్ల మేర విక్రయాలు జరిగాయి. దేశంలోని ప్రధాన మార్కెట్లలో ఈ సెగ్మెంట్‌లో మొత్తం రూ. 1.15 లక్షల కోట్ల అమ్మకాలు నమోదు కాగా, అందులో దాదాపు 69 శాతం వాటా ఈ మూడు నగరాలదే కావడం గమనార్హం. ఈ జాబితాలో హైదరాబాద్ నగరం నాలుగో స్థానంలో నిలిచి తన సత్తా చాటింది. హైదరాబాద్‌లో రూ. 18,948 కోట్ల విలువైన 6,424 యూనిట్లు అమ్ముడైనట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పుణే, అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతా నగరాలు ఈ జాబితాలో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. భారతీయులలో ఖరీదైన, విలాసవంతమైన ఇళ్లను కొనుగోలు చేసే ధోరణి (ప్రీమియమైజేషన్) క్రమంగా పెరుగుతోందని ఈ నివేదికలు విశ్లేషిస్తున్నాయి. పెరిగిన ఆదాయాలు, విశాలమైన ఇళ్ల ఆవశ్యకత, ప్రధాన ప్రాంతాల్లో నివసించాలనే ఆకాంక్ష వంటివి ఈ ధోరణికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. అమ్మకాల విలువలో బెంగళూరు ముందున్నప్పటికీ, అమ్ముడైన యూనిట్ల సంఖ్యలో మాత్రం ఎన్‌సీఆర్ ప్రథమ స్థానంలో ఉందని మరో సంస్థ 'నైట్ ఫ్రాంక్' పేర్కొంది.

# రూ.లక్ష కోట్లతో సీమ హార్టీకల్చర్ హబ్

రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన పంటల కేంద్రంగా (గ్లోబల్ ఫ్రూట్ బౌల్) తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బృహత్ ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో 'రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్' ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో సీఎం ఈ వివరాలు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమలోని 10 జిల్లాల్లో 201 క్లస్టర్ల ద్వారా ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో ప్రభుత్వం రూ. 40 వేల కోట్లు, ప్రైవేటు రంగం రూ. 60 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. ఒకప్పుడు కరవుతో అల్లాడిన రాయలసీమను ఉద్యాన రంగం ద్వారా ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. హంద్రీనీవా, గాలేరునగరి వంటి ప్రాజెక్టుల ద్వారా నీటి లభ్యత పెరగడం ఈ మార్పునకు దోహదం చేసిందని ఆయన గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను (ఎఫ్‌పీవో) బలోపేతం చేయనున్నారు. కొత్త పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఇదే కార్యక్రమంలో భాగంగా మదనపల్లెలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఈ సమీక్షలో ఎల్‌నినో ప్రభావం, ద్రవ్యోల్బణంపై కూడా సీఎం అధికారులతో చర్చించారు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు శనగ, మినుము, రాగులు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. నిత్యావసరాల ధరలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూనే వినియోగదారులపై భారం పడకుండా చూడాలని ఆదేశించారు. ఈ హబ్ ద్వారా రాబోయే 56 ఏళ్లలో సీమ రూపురేఖలు మార్చాలని లక్ష్యంగా నిర్దేశించారు.

# గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ బడా గణేష్

ఉత్తరప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులను మిగులుస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. దేశ రక్షణ ఉత్పత్తుల తయారీలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కీలక కేంద్రంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. గ్రేటర్ నోయిడాలో శుక్రవారం జరిగిన 'ఉత్తరప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన' (యూపీఐటీఎస్)ను ప్రారంభించిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యూపీ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా లక్నోలో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణుల గురించి అమిత్ షా ప్రత్యేకంగా ప్రస్తావించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా, అమేథీలో తయారవుతున్న ఏకే203 అసాల్ట్ రైఫిళ్లు నక్సలైట్లు, ఉగ్రవాదులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. కేంద్రం, రాష్ట్రంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల సమన్వయంతో, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో ఉత్తరప్రదేశ్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని అమిత్ షా ప్రశంసించారు. ఒకప్పుడు నేరాలు, వలసలకు నిలయంగా ఉన్న రాష్ట్రం, నేడు రక్షణ సామాగ్రి, వాహన శ్రేణి, వైద్య పరికరాల తయారీకి గమ్యస్థానంగా మారిందని కొనియాడారు. మెరుగైన శాంతిభద్రతల వల్లే రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, 'ఒక జిల్లాఒక ఉత్పత్తి' పథకం అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 12 ఏళ్ల క్రితం ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం నేడు సత్ఫలితాలను ఇస్తోందని షా తెలిపారు. ప్రస్తుతం భారత్ రక్షణ ఉత్పత్తుల విలువ రూ. 1 లక్ష కోట్లు దాటిందని, దాదాపు 80 దేశాలకు రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తోందని, ఇందులో యూపీ పాత్ర కీలకమని అన్నారు. లక్నోలోని బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీని 2025 మే నెలలో ప్రారంభించగా, తొలి బ్యాచ్ క్షిపణులను 2025 అక్టోబర్ లో విడుదల చేశారని ఆయన పేర్కొన్నారు.

# ఖరీదైన ఇళ్లలో బెంగళూరు టాప్..
# హైదరాబాద్ నాలుగో ర్యాంక్



దేశంలో ఖరీదైన ఇళ్ల మార్కెట్‌లో బెంగళూరు నగరం సరికొత్త రికార్డు సృష్టించింది. 2026 ప్రథమార్ధంలో (జనవరి జూన్) రూ. 2 కోట్ల నుంచి రూ. 5 కోట్ల మధ్య ధర కలిగిన నివాస గృహాల విక్రయాల్లో బెంగళూరు అగ్రస్థానంలో నిలిచింది. ఈ విభాగంలో దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్), ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లను సైతం బెంగళూరు అధిగమించింది. ప్రముఖ రియల్ ఎస్టేట్ అనలిటిక్స్ సంస్థ 'క్రెమ్యాట్రిక్స్' తన తాజా నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. నివేదిక ప్రకారం, ఈ ఆరు నెలల కాలంలో బెంగళూరులో రూ. 31,216 కోట్ల విలువైన 11,556 ఇళ్లు అమ్ముడయ్యాయి. ఇదే సమయంలో ఎన్‌సీఆర్‌లో రూ. 27,125 కోట్లు, ముంబైలో రూ. 21,952 కోట్ల మేర విక్రయాలు జరిగాయి. దేశంలోని ప్రధాన మార్కెట్లలో ఈ సెగ్మెంట్‌లో మొత్తం రూ. 1.15 లక్షల కోట్ల అమ్మకాలు నమోదు కాగా, అందులో దాదాపు 69 శాతం వాటా ఈ మూడు నగరాలదే కావడం గమనార్హం. ఈ జాబితాలో హైదరాబాద్ నగరం నాలుగో స్థానంలో నిలిచి తన సత్తా చాటింది. హైదరాబాద్‌లో రూ. 18,948 కోట్ల విలువైన 6,424 యూనిట్లు అమ్ముడైనట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పుణే, అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతా నగరాలు ఈ జాబితాలో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. భారతీయులలో ఖరీదైన, విలాసవంతమైన ఇళ్లను కొనుగోలు చేసే ధోరణి (ప్రీమియమైజేషన్) క్రమంగా పెరుగుతోందని ఈ నివేదికలు విశ్లేషిస్తున్నాయి. పెరిగిన ఆదాయాలు, విశాలమైన ఇళ్ల ఆవశ్యకత, ప్రధాన ప్రాంతాల్లో నివసించాలనే ఆకాంక్ష వంటివి ఈ ధోరణికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. అమ్మకాల విలువలో బెంగళూరు ముందున్నప్పటికీ, అమ్ముడైన యూనిట్ల సంఖ్యలో మాత్రం ఎన్‌సీఆర్ ప్రథమ స్థానంలో ఉందని మరో సంస్థ 'నైట్ ఫ్రాంక్' పేర్కొంది.

# ఐఐటీల్లో పెరుగుతున్న మరణాలు.. పదేళ్లలో డబుల్

ఐఐటీ.. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఒకటి. ఇక్కడ సీటు కోసం విద్యార్థులు ఏళ్ల తరబడి కష్టపడతారు. కానీ అదే క్యాంపస్‌లలో విద్యార్థుల ఆత్మహత్యలు, అసహజ మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2006 నుంచి 2026 సెప్టెంబర్ వరకు ఐఐటీల్లో 171 మంది విద్యార్థులు ఆత్మహత్యలు లేదా అసహజ మరణాలకు గురైనట్లు ఓ లెక్క వెల్లడించింది. 2006 నుంచి 2015 వరకు 51 మరణాలు నమోదయ్యాయి. 2016 నుంచి 2026 సెప్టెంబర్ వరకు ఈ సంఖ్య 120కి చేరింది. ఈ వివరాలను ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి ధీరజ్ సింగ్ ఆర్టీఐ సమాధానాలు, మీడియా కథనాల ఆధారంగా సేకరించారు. క్యాంపస్‌ల వారీగా చూస్తే ఐఐటీ ఖరగ్‌పూర్‌లో అత్యధికంగా 29 మరణాలు నమోదయ్యాయి. తర్వాత ఐఐటీ మద్రాస్‌లో 26, ఐఐటీ కాన్పూర్‌లో 21 ఉన్నాయి. ఐఐటీ ఢిల్లీలో 17, ఐఐటీ బాంబే, ఐఐటీ గువాహటిలో 14 చొప్పున నమోదయ్యాయి. ఇటీవలి ఐదేళ్లలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా కనిపిస్తోంది. 2021 సెప్టెంబర్ నుంచి 2026 సెప్టెంబర్ వరకు 74 మంది ఐఐటీ విద్యార్థులు ఆత్మహత్యలు లేదా అసహజ మరణాలకు గురైనట్లు లెక్కలు చెబుతున్నాయి. 2022, 2023, 2024లో 14 చొప్పున మరణాలు నమోదయ్యాయి. 2025లో 16కి పెరిగాయి. 2026 సెప్టెంబర్ 18 నాటికే 13 మంది మృతి చెందారు. ఈ లెక్కలు మరణాలకు కారణాలను మాత్రం చెప్పడం లేదు. ఒక్కో ఘటన వెనుక వ్యక్తిగత, చదువు, ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఉండొచ్చు. అయినా ఇటీవలి కాలంలో మరణాల సంఖ్య ఎక్కువగా ఉండటం ఐఐటీల్లో విద్యార్థుల సంక్షేమంపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది.

# భారత్ భయంతో దావూద్‌కు ఐఎస్ఐ కొత్త రక్షణ

అంతర్జాతీయ ఉగ్రవాది, అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం విషయంలో పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ తన వ్యూహాన్ని మార్చుకున్నట్లు తెలుస్తోంది. అతడిని ఉపయోగించుకోవడం కంటే, అతడి భద్రతకే ఇప్పుడు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలోనే దావూద్ నివాసాన్ని కరాచీ పోర్టుకు సమీపంలోని ఒక సురక్షిత ప్రాంతానికి మార్చినట్లు సమాచారం. భవిష్యత్తులో భారత్ ఏదైనా ఆపరేషన్ చేపడితే, అక్కడి నుంచి సులభంగా తప్పించుకునేందుకే ఈ ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. గతేడాది మేలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత దావూద్ భద్రత విషయంలో ఐఎస్ఐ మరింత అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. ఒకవేళ దావూద్ భారత ఆపరేషన్‌లో మరణిస్తే, ఇన్నాళ్లూ తమ దేశంలో లేడని చెబుతున్న పాకిస్థాన్ వాదన అబద్ధమని ప్రపంచానికి తెలిసిపోతుందనే భయంతో ఐఎస్ఐ ఈ చర్యలు చేపడుతోంది. దావూద్ అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ, ప్రస్తుతం కరాచీలోనే ఉన్నట్లు నిఘా వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఐఎస్ఐకి దావూద్ వ్యవహారం కత్తి మీద సాములా మారింది. లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలకు నిధులు సమకూర్చడానికి దావూద్ నడిపే మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌పైనే ఐఎస్ఐ ఆధారపడింది. అయితే, ప్రస్తుతం డ్రగ్స్ వ్యాపారాన్ని విస్తరించడం కంటే దావూద్ ఆరోగ్యం, భద్రతకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండటం గమనార్హం. దీంతో ఉగ్రసంస్థలకు నిధుల సేకరణపై ప్రభావం పడుతోంది. మరోవైపు, డీకంపెనీలో అంతర్గత సమస్యలు కూడా తలెత్తాయి. దావూద్ అనారోగ్యంతో ఉండటంతో తదుపరి నాయకత్వం కోసం అతడి సోదరుడు అనీస్ ఇబ్రహీం, నమ్మినబంటు ఛోటా షకీల్ మధ్య వారసత్వ పోరు మొదలైంది. ఇదే సమయంలో భారత ప్రభుత్వం డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపడం, దావూద్ ముఖ్య అనుచరుడు సలీం డోలాను అరెస్ట్ చేయడంతో డీకంపెనీ కార్యకలాపాలు దెబ్బతిన్నాయి. ఈ పరిణామాలన్నీ ఐఎస్ఐకి తలనొప్పిగా మారాయి. ఒకవైపు ఎఫ్ఏటీఎఫ్ నిఘా, మరోవైపు డీకంపెనీ బలహీనపడటం పాక్‌కు ఇబ్బందికరంగా మారింది. దావూద్ నెట్‌వర్క్ బలహీనపడటం భారత భద్రతా సంస్థలకు సానుకూల అంశమని, దేశంలో మాదకద్రవ్యాల సమస్యను తగ్గించడానికి ఇది దోహదపడుతుందని అధికారులు విశ్లేషిస్తున్నారు.

## దీన్‌దయాళ్ బాటలోనే
# వికసిత్ భారత్: మోదీ

స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథాన్ని అందించిన మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తే బీజేపీకి, తమ ప్రభుత్వాల నిర్ణయాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. వ్యక్తి ప్రగతి సమాజం నుంచి వేరుగా కాకుండా, సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంత సారమని చెప్పారు. ప్రకృతిని దెబ్బతీయకుండా సమాజం పురోగమించేలా అభివృద్ధి నమూనా ఉండాలని ఆయన ఆలోచనలు చెబుతాయని వివరించారు. దీన్ దయాళ్ జయంతి సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరడమే అంత్యోదయ లక్ష్యమని మోదీ గుర్తుచేశారు. ఏకాత్మ మానవతావాదాన్ని వివరిస్తూ, వ్యక్తి ఎదుగుదలతో పాటు సమాజం, ప్రకృతి, దేశం మధ్య సమతుల్యత ఉండాలని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారని ప్రధాని పేర్కొన్నారు. కేవలం ఆర్థిక వృద్ధే అభివృద్ధి కాదని, అందులో సామాజిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కూడా భాగస్వామ్యం కావాలని ఆయన భావించినట్లు తెలిపారు. పేదల సంక్షేమం, సమాజంలోని అట్టడుగు వర్గాల సాధికారత, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమిస్తూ తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని మోదీ వివరించారు. ఈ ఆలోచనల స్ఫూర్తితోనే సమగ్ర, అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగా 'వికసిత్ భారత్' నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.

# పవన్ సమక్షంలో జనసేనలో చేరిన వైకాపా నేతలు

అమరావతి: వైకాపా నుంచి పలువురు ముఖ్య నేతలు జనసేన పార్టీలో చేరారు. తుని నియోజకవర్గానికి చెందిన వైకాపా నేత యనమల కృష్ణుడు, హిందూపురం నియోజకవర్గం నుంచి నవీన్ నిశ్చల్.. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన కండువా కప్పుకొన్నారు. వీరితో పాటు.. ఏలూరు డీసీసీబీ మాజీ ఛైర్మన్ పీవీఎల్ఎన్ నరసింహరాజు, వైకాపా కందుకూరు, సర్వేపల్లి, కనిగిరి నియోజకవర్గాల పరిశీలకుడు మన్నెమాల సుకుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు అయితాబత్తుల సుభాషిణి, తుని వైకాపా నాయకుడు పోలినాటి శేషగిరిరావు, తణుకు వైకాపా నాయకుడు దిరిశాల కృష్ణ శ్రీనివాస్, శ్రీకాళహస్తికి చెందిన వైకాపా నేత సత్రవాడ ప్రవీణ్, మిద్దెల హరి, ముమ్మిడివరం మాజీ ఏఎంసీ ఛైర్మన్ కుడిపూడి శివన్నారాయణ నరసరావుపేట నుంచి ఏలూరి ప్రసాద్ జనసేనలో చేరారు. వారందరికీ పవన్ కల్యాణ్ జనసేన కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. పార్టీ సిద్ధాంతాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అందరినీ కలుపుకొని వెళ్లి పార్టీ ఉన్నతి కోసం పని చేయాలని పవన్ సూచించారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, పరిపాలనలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిబద్ధత, సంస్కరణలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.

## సంపాదకీయం

# ఐఐటీల్లో విద్యార్థుల ఆత్మహత్యలు

# వ్యవస్థాగత లోపాలా? కుల వివక్షా?

ఐఐటీ బాంబేలో ఒక విద్యార్థి ఆత్మహత్య అనేక మలుపులు తిరిగి, చివరకు ఆ విద్యార్థి దళిత నేపథ్యం వైపునకు మళ్లింది. సాధారణంగా ఒక విద్యార్థి ఆత్మహత్యకు చదువుకు సంబంధించిన ఒత్తిడే ప్రధాన కారణం అవుతుంది. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి సాహిల్, పరీక్ష రాసే సమయంలో సెల్ ఫోన్లో చాట్ జీపీటీ (ChatGPT) ద్వారా సమాధానాలు రాయటం గమనించిన ప్రొఫెసర్ అతడిని పరీక్ష కేంద్రం నుండి బయటకు పంపించివేశారు అనేది ప్రధాన ఆరోపణ. పరీక్షల్లో అక్రమాలు జరిగినప్పుడు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే హక్కు ప్రొఫెసర్లకు ఉన్నప్పటికీ, అది పూర్తిగా నిబంధనలకు లోబడి మాత్రమే ఉండాలి. విశ్వవిద్యాలయాలు, ఐఐటీల ప్రామాణిక నిబంధనల ప్రకారం విద్యార్థి కాపీ కొడుతూ పట్టుబడితే—మొదట రాస్తున్న ఆన్సర్ షీటును, కాపీ కొట్టటానికి ఉపయోగించిన పరికరాన్ని సీజ్ చేసి, మరో కొత్త జవాబు పత్రం ఇచ్చి మిగిలిన సమయం పరీక్ష రాయటానికి అనుమతించాలి. ఈ నిబంధన వెనుక ఉన్న కారణం ఏమిటంటే, ఇన్విజిలేటర్ పట్టుకున్నంత మాత్రాన నేరం అధికారికంగా రుజువు అయినట్లు కాదు. విద్యార్థిని మాల్ ప్రాక్టీస్ కమిటీకి అప్పగిస్తే, విద్యార్థికి తన వివరణ ఇచ్చుకునే హక్కు ఉంటుంది. ఒకవేళ కమిటీ విచారణలో విద్యార్థి నిర్దోషి అని తేలితే, పరీక్ష రాయకుండా ఆపినందుకు అతనికి జరిగే విద్యా సంవత్సర నష్టాన్ని ఎవరూ పూడ్చలేరు. ఈ నిబంధన వెనుక ఉన్న మరో ముఖ్య కారణం—కాపీ కొడుతూ పట్టుబడిన విద్యార్థిని పరీక్ష హాలు నుండి గెంటివేయటం వలన విద్యార్థి తీవ్ర అవమానానికి, మానసిక క్షోభకు గురయ్యే ప్రమాదం ఉంది. సాహిల్ విషయంలో ఇప్పుడు ప్రధానమైన ఆరోపణ ఇదే. ఇప్పటివరకు వెలుగు చూసిన సీసీటీవీ దృశ్యాల ప్రకారం, నిర్దేశిత విధివిధానాలకు విరుద్ధంగా ప్రొఫెసర్ సాహిల్ ను పరీక్ష హాలు నుండి బయటకు పంపించినట్లు తెలుస్తున్నది. అది ఆరోపణ మాత్రమే అని కొట్టిపారేసే అవకాశం కూడా కనిపించటం లేదు; కారణం సాహిల్ ఆత్మహత్య తరువాత ఐఐటీ బాంబే యాజమాన్యం విడుదల చేసిన ప్రకటన. సాహిల్ సెప్టెంబర్ 18 న జరిగిన పరీక్ష హాలులో తన మొబైల్ ఫోన్ ను ఉపయోగించి చాట్ జీపీటీ ద్వారా కాపీ కొడుతూ ప్రొఫెసర్ కు చిక్కాడని, ఫోన్ దొరికిన వెంటనే ప్రొఫెసర్ అతడి నుండి మొబైల్ ను స్వాధీనం చేసుకుని, పరీక్ష హాలు నుండి పంపించి వేశారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అందులో ఎక్కడా సాహిల్ కు కొత్త జవాబు పత్రం ఇచ్చి మిగిలిన సమయం పరీక్ష రాసే అవకాశం ఇచ్చినట్లుగా కానీ, మాల్ ప్రాక్టీస్ కమిటీకి అప్పగించినట్లు కానీ ప్రస్తావించలేదు. కాబట్టి సాహిల్ కు నిబంధనల ప్రకారం దక్కాల్సిన అవకాశాలను ఇవ్వలేదు అనే వాదనకు బలం చేకూరుతున్నది. మాల్ ప్రాక్టీస్ కమిటీకి పంపించి ఉంటే సాహిల్ కు మరో అవకాశం కూడా వచ్చి ఉండేది. కాపీ కొడుతూ దొరికిపోయాడని తోటి విద్యార్థుల ముందు అవమానపడి మానసిక క్షోభకు గురవుతాడని భావించి, నిబంధనల ప్రకారం అతడిని కౌన్సిలింగ్ కు పంపించేవారు. బహుశా అప్పుడు అతడు ఆత్మహత్య చేసుకుని ఉండేవాడు కాదేమో. ఐఐటీ లాంటి అత్యున్నత విద్యాసంస్థల్లో కూడా కనీస నిబంధనలు పాటించకపోవటం ఆశ్చర్యం కలిగిస్తున్నది. ప్రస్తుతానికి భారతదేశంలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలంటే ముందు వరుసలో నిలబడేవి ఐఐటీలే. ఐఐటీలలో ప్రవేశం దొరకటమే అసాధారణంగా చూస్తున్న రోజుల్లో, ఐఐటీ ప్రొఫెసర్లే నిబంధనలు పాటించకపోతే అవి తమ విశ్వసనీయతను, ప్రత్యేకతను కోల్పోయే ప్రమాదం ఉంది. ఇక ఐఐటీలలో కులవివక్ష ఉంటున్నదనే దానికి నిదర్శనం—ప్రతి ఐఐటీలోనూ 'ఎస్సీ, ఎస్టీ సెల్' ఒకటి ఉండటం. లింగ వివక్ష, లైంగిక వేధింపులు ఉంటాయనే ఉద్దేశంతోనే మహిళా ప్రొటెక్షన్ సెల్ కూడా పనిచేస్తుంది. సాహిల్ ఉదంతంలో మరొక్కసారి ఎస్సీ, ఎస్టీ చట్టం దుర్వినియోగం అయినట్లు కనిపిస్తున్నది. కాపీ కొడుతుంటే పట్టుకున్న ప్రొఫెసర్ వల్ల కానీ, యాజమాన్యం వల్ల కానీ సాహిల్ కుల వివక్షకు గురై ఉంటే, క్యాంపస్ లో ఉండే ఎస్సీ, ఎస్టీ సెల్ వద్ద ఫిర్యాదు చేసి ఉండేవాడు. ఇప్పటి వరకు సాహిల్ అలాంటి ఫిర్యాదు చేశాడని క్యాంపస్ లో ఉన్న ఎస్సీ, ఎస్టీ సెల్ నుండి ఎలాంటి ప్రకటన కూడా రాలేదు. కానీ సాహిల్ తల్లిదండ్రులు ఆ ప్రొఫెసర్ పైన, యాజమాన్యంలోని కొందరి పైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు పెట్టారు. ఏదో ఒక సమయంలో ప్రొఫెసర్ అరెస్ట్ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, ఇక్కడ అసలు విషయం పక్కదారి పట్టింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రాథమికంగా ప్రొఫెసర్ ను ఇబ్బంది పెట్టవచ్చు; కానీ ఆ కేసులో ప్రొఫెసర్ తాను కుల వివక్ష చూపించలేదని, కులం పేరుతో దూషించలేదని నిరూపించుకోగలడు. ఐఐటీ లాంటి విద్యాసంస్థ నియమ నిబంధనలను పాటించకపోవటం వలనే, నివారించగలిగే సాహిల్ ఆత్మహత్యను నివారించలేకపోయారు అనేది ఇక్కడ స్పష్టంగా నిరూపించదగిన అంశం. ముఖ్యంగా ఆలోచించవలసింది విద్యార్థుల మానసిక పరిస్థితి గురించి. ఐఐటీలో చేరిన చాలామంది అక్కడి విద్యా విధానానికి త్వరగా అలవాటుపడలేక విపరీతమైన ఒత్తిడికి లోనవుతుంటారు. రిజర్వేషన్ కేటగిరీలో వచ్చిన వారికి మరో సమస్య ఉంటుంది. ప్రవేశ పరీక్షలలో ఎస్సీ అభ్యర్థులు మిగిలిన జనరల్ కేటగిరీ వారితో సమానమైన మార్కులు తెచ్చుకోవలసిన అవసరం ఉండదు; అందుకే క్లాసులో అందరికంటే తాము బలహీనంగా ఉన్నామనే న్యూనతాభావం చేరిన మొదటి రోజు నుంచే వారిని వెంటాడుతుంది. అటువంటి మానసిక ఒత్తిడి నుండి బయటపడటానికి ఒక సీనియర్ విద్యార్థి మెంటార్ గా ఉంటారు. సాధారణ విద్యాసంస్థలతో పోలిస్తే ఐఐటీలలో విద్యార్థులకు ఉండే సౌకర్యాలు ఎంతో ఎక్కువ. అలా ఉన్న వ్యవస్థాగత సౌకర్యాలను వినియోగించుకోవలసిన విద్యార్థి అర్ధాంతరంగా ఆత్మహత్య చేసుకోవటమే అత్యంత బాధాకరం. అటువంటి సున్నితమైన పరిస్థితిని ఎస్సీ, ఎస్టీ చట్టం వైపు మళ్లించటం మరో ప్రమాదకరమైన కోణం. అలా అని ఐఐటీ ప్రాంగణాలలో కుల వివక్ష అసలే లేదు అని చెప్పలేం. ఖరగ్‌పూర్ ఐఐటీలో అసోసియేట్ ప్రొఫెసర్ గా ఉన్న సీమా సింగ్, ఆన్‌లైన్ ప్రిపరేటరీ క్లాసులో ఎస్సీ, ఎస్టీ మరియు దివ్యాంగ విద్యార్థులపై తీవ్రమైన కుల వివక్ష వ్యాఖ్యలు చేస్తూ, అసభ్య పదజాలంతో దూషించిన వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ అయిన తరువాత విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు ఆమెపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. సాధారణంగా ఐఐటీలలో ప్రొఫెసర్లపై పెట్టే ఎస్సీ, ఎస్టీ కేసుల్లో రెండు రకాలు ఉంటాయి: ఒకటి అకాడమిక్ వేధింపులు కాగా, మరొకటి తోటి అధ్యాపకుల పట్ల సీనియర్ ప్రొఫెసర్లు చూపించే పక్షపాతంపై నమోదయ్యేవి. అంటే అంతర్గత ఫ్యాకల్టీ వివాదాలే ఎక్కువగా నమోదవుతూ ఉంటాయి. మరోవైపు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కూడా కుల వివక్షను కచ్చితంగా ఎదుర్కొంటున్నారు. సాహిల్ విషయంలో ఆ నిమిషాన ప్రొఫెసర్ కుల వివక్ష చూపించాడా లేదా అనేది పక్కన పెడితే, విద్యార్థుల మధ్య రిజర్వేషన్ల పైన వాదోపవాదాలు, ఘర్షణలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. మండల్ కమిషన్ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఓబీసీలకు రిజర్వేషన్లు ప్రకటించగానే దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు చెలరేగాయి. రిజర్వేషన్ల ఆవశ్యకత గురించి సరైన అవగాహన కల్పించకపోవటం వలన ఐఐటీ లాంటి అత్యున్నత సంస్థల్లో కూడా విద్యార్థుల మధ్య ఇలాంటి వాగ్వాదాలు వస్తూనే ఉన్నాయి. సహజంగానే ఐఐటీలలో ఎస్సీ, ఎస్టీ ఫ్యాకల్టీ ప్రాతినిధ్యం తక్కువగా ఉంటుంది. ప్రాథమిక నియామకాలలో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం రిజర్వేషన్ ఉన్నప్పటికీ, ఐఐటీ ప్రొఫెసర్ పోస్టుకు నిర్దేశించిన కఠినమైన అర్హతలు లేని అభ్యర్థులను తీసుకోరు. ఆ కారణం చేత అనేక ఐఐటీలలో ఎస్సీ, ఎస్టీ కోటా పోస్టులే కాకుండా జనరల్ కేటగిరీ పోస్టులు కూడా పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉంటున్నాయి. అలా అని అర్హతల విషయంలో రాజీపడితే సంస్థల ప్రమాణాలు, పనితీరు దెబ్బతింటాయి. కనీసం కేటాయించిన ఎస్సీ, ఎస్టీ పోస్టులైనా భర్తీ అయి నిండుగా ఉంటే, క్యాంపస్‌లోకి వచ్చే అణగారిన వర్గాల విద్యార్థులకు కొంత మానసిక ధైర్యం ఉంటుంది. అదే సమయంలో డైరెక్టర్ల స్థాయిలో ఎస్సీ, ఎస్టీ వర్గాల నుండి ఒక్కరు కూడా ప్రాతినిధ్యం వహించే పరిస్థితులు కనిపించటం లేదు. రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉండే విద్యార్థులకు మరింత సమగ్రమైన అండగా నిలిచే వ్యవస్థ (Support System) ఉంటే, క్యాంపస్‌లలో ఇంతగా వైషమ్యాలు పెరగకుండా ఉండే అవకాశం ఉంటుంది. అంతమాత్రాన వీటన్నిటికీ ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు పెట్టడమే పరిష్కారం కాదు; అది వేరే దుష్పరిణామాలకు దారితీస్తుంది. ఇప్పుడు సాహిల్ కేసులో కుల వివక్ష లేకపోయినా ఉన్నట్లుగా ఫిర్యాదు చేస్తే, భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఏదైనా సమస్య వచ్చినా వారికి సహాయం చేయడానికి లేదా వారి విషయంలో నిబంధనలు అమలు చేయడానికి ప్రొఫెసర్లు భయపడి ఉదాసీనంగా వ్యవహరించే ప్రమాదం ఏర్పడుతుంది.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు

సెప్టెంబర్ 26

SEP 26

* 1820: బెంగాలీ కవి, విద్యావేత్త, తత్త్వవేత్త, పారిశ్రామిక వేత్త, రచయిత, అనువాదకుడు, సమాజ సేవకుడు ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్ జననం (మ1891).
* 1867: తెలుగు రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం జననం (మ.1946).
* 1886: భారతదేశంలో బ్రిటిషు ఐ.సి.ఎస్. అధికారి, స్వాతంత్ర్యానికి పూర్వపు బీహారు రాష్ట్ర గవర్నరు థామస్ జార్జ్ రూథర్‌ఫర్డ్ జననం (మ.1957).
* 1895: భారత యోగీశ్వరుడు, మహావతార్ బాబాజీ కి శిష్యుడు లాహిరి మహాశయులు మరణం (జ.1828).
* 1907: స్వాతంత్ర్య సమరయోధుడు, చరిత్రకారుడు, చలనచిత్ర దర్శకుడు ఆమంచర్ల గోపాలరావు జననం (మ.1969).
* 1943: దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా తరపున ఆడిన మాజీ క్రికెట్ క్రీడాకారుడు ఇయాన్ చాపెల్ జననం.
* 1960: వెస్ట్ఇండీస్ కు చెందిన మాజీ క్రికెట్ క్రీడాకారుడు, క్రికెట్ శిక్షకుడు గస్ లోగీ జననం.
* 1999: అనేక ప్రపంచ ఆర్థిక సంక్షోభాలకు ప్రతిస్పందనగా జీ20 స్థాపించబడింది.
* 2024: తెలుగు వికీపీడియా లక్ష వ్యాసాల మైలురాయిని దాటింది. (లక్షవ వ్యాసం: రతీంద్రనాథ్ ఠాగూర్)



చిలకమర్తి లక్ష్మీనరసింహం



## ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు..

# ఆర్జిత సేవా టికెట్లు విడుదల

విజయవాడ: ఇంద్రకీలాద్రి(Indrakiladri) పై శరన్నవరాత్రి మహోత్సవాలకు ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవా టికెట్లను శుక్రవారం లాంఛనంగా విడుదల చేశారు. అక్టోబర్ 11 నుంచి 20 వరకు జరగనున్న ఈ ఉత్సవాల టికెట్లను దేవస్థానం ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్, స్థానాచార్యులతో కలిసి ఆవిష్కరించారు. దేవస్థానం నూతన పూజా మండపంలో శాస్త్రోక్తంగా నిర్వహించనున్న ప్రత్యేక ఖడ్గమాలార్చన, ప్రత్యేక కుంకుమార్చన, చండీయాగం, శ్రీచక్ర నవావరణార్చన సేవలను భక్తులు ఇంటి వద్ద నుంచే పరోక్షంగా వీక్షించవచ్చు. పూజా సమయంలో భక్తుల పేర్లు, గోత్రాలను అమ్మవారి సన్నిధిలో అర్చకులు చదువుతారు. భక్తులు లైవ్ లింక్ ద్వారా ఈ పూజలను తిలకించి తరించవచ్చు. సేవా టికెట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవాదాయ శాఖ అధికారిక పోర్టల్ https://tms.ap.gov.in ద్వారా లేదా ప్రభుత్వ 'మనమిత్ర' అధికారిక వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ద్వారా అత్యంత సులభంగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని ఈవో శీనానాయక్ తెలిపారు. ఒక రోజు పూజా టికెట్ రుసుము రూ.1,500, పది రోజులకు ప్యాకేజీ రుసుము: రూ.11,116/ (నవరాత్రుల మొత్తం 10 రోజులకు)గా నిర్ణయించారు. ఉత్సవాలు ముగిసిన తర్వాత భక్తుల చిరునామాకు తపాలా ద్వారా అమ్మవారి శేష వస్త్రం, రవిక ముక్క, శ్రీచక్ర పీఠం, ల్యామినేషన్ ఫొటో, కుంకుమ భరిణె, రక్షా కంకణాలను పంపిస్తారు. పరోక్ష సేవా టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు నేరుగా దేవస్థానంలో పూజల్లో పాల్గొనేందుకు గానీ, అమ్మవారి దర్శనానికి గానీ ఎలాంటి అనుమతి ఉండదు. దూర ప్రాంతాల నుంచి రాలేని భక్తులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవస్థానం ఛైర్మన్, ఈవో కోరారు.

## రానున్న మూడు రోజులు

# ఏపీలో మోస్తరు వర్షాలు

విశాఖ(ఏయూ ప్రాంగణం): వాయుగుండం శుక్రవారం రాయపూర్(ఛత్తీస్‌గఢ్)కు తూర్పు ఆగ్నేయంగా సుమారు 80 కి.మీ. దూరంలో, చంపాకు దక్షిణ నైరుతిగా 130 కి.మీ., బిలాస్‌పూర్‌కు దక్షిణంగా 140 కి.మీ. దూరంలో ఉందని భారత వాతావరణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రానున్న 12 గంటల్లో ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ తీవ్రతను కొనసాగించి.. తర్వాత 12గంటల్లో బలహీనపడి తీవ్ర అల్పపీడన ప్రాంతంగా మారే అవకాశముందని పేర్కొంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతాల్లోని దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని తెలిపింది. ఫలితంగా



ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశముందని తెలిపింది. పలు ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కి.మీ. వరకు.. గరిష్ఠంగా 60 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని ప్రకటనలో పేర్కొంది.

## ఏపీ పొగాకు రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని పొగాకు రైతుల(tobacco farmers)కు కేంద్ర ప్రభుత్వం(Union government) శుభవార్త చెప్పింది. ఎఫ్‌సీవీ (FCV) పొగాకు రైతులకు భారీ ఊరట కల్పించేలా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎఫ్‌సీవీ పొగాకు ప్రతి బార్న్‌కు రూ.50 వేలు వడ్డీ లేని రుణం మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకృతి వైపరీత్యాలు, ఆర్థిక ఇబ్బందుల నుంచి రైతులను ఆదుకునేందుకు.. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల భారం నుంచి పొగాకు రైతులకు తక్షణ ఉపశమనం కల్పించాలని నిర్ణయించినట్లు కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది.

# పోలీసులను తన నివాసానికి ఆహ్వానించి సత్కరించిన ఏపీ హోంమంత్రి అనిత

- **అనకాపల్లి జిల్లా పోలీసులను సత్కరించిన హోంమంత్రి అనిత**
- **రాష్ట్రస్థాయి క్రీడల్లో 6 స్వర్ణాలు గెలిచిన మహిళా కానిస్టేబుల్‌కు అభినందన**
- **టెక్నాలజీతో దొంగలను పట్టుకుంటున్న కానిస్టేబుల్‌కు ప్రశంసలు**
- **అవయవదానం చేసిన డీఎస్పీని ప్రత్యేకంగా అభినందించిన మంత్రి**
- **తన నివాసానికి ఆహ్వానించి, వారితో కలిసి భోజనం చేసిన అనిత**

ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత, విధి నిర్వహణలోనూ, క్రీడల్లోనూ, సామాజిక సేవలోనూ విశేష ప్రతిభ కనబరిచిన ముగ్గురు పోలీసు సిబ్బందిని ఘనంగా సత్కరించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలోని తన నివాసానికి వారిని ప్రత్యేకంగా ఆహ్వానించి, అభినందనలు తెలిపి, వారితో కలిసి భోజనం చేశారు. పోలీసు సిబ్బంది ప్రతిభను, సేవా స్ఫూర్తిని ప్రోత్సహించడం తన బాధ్యత అని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే, ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో అనకాపల్లి జిల్లాకు చెందిన మహిళా కానిస్టేబుల్ వి. విజయ అద్భుత ప్రతిభ కనబరిచారు. ఏకంగా ఆరు స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ఆమె సాధిస్తున్న విజయాలు స్ఫూర్తిదాయకమని మంత్రి అనిత ప్రశంసించారు. విజయను ప్రత్యేకంగా సత్కరించి, ఆమె ప్రతిభను కొనియాడారు. అలాగే, పాయకరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కీలక కేసుల దర్యాప్తులో సాంకేతిక



పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తున్న కానిస్టేబుల్ రాంబాబును కూడా మంత్రి అనిత అభినందించారు. ముఖ్యంగా బైక్ దొంగతనాల కేసుల్లో 'ఐటీ కోర్ అనాలిసిస్' ద్వారా నిందితుల కదలికలను గుర్తించి, వారిని పట్టుకోవడంలో రాంబాబు చూపిన నైపుణ్యం ప్రశంసనీయమని ఆమె అన్నారు. వీరితో పాటు, అవయవదానం చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచిన నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావును కూడా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మానవతా విలువలను చాటిచెప్పారని కొనియాడారు. ప్రజా



సేవలో ముందుండే పోలీసు సిబ్బందికి అండగా నిలవడం, వారిని ప్రోత్సహించడం ఎల్లప్పుడూ తన బాధ్యత అని హోంమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు.

# ఏపీలో హోంగార్డులకు శుభవార్త

అమరావతి: రాష్ట్రంలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా పోలీస్ స్టయిఫండరీ కానిస్టేబుల్ (డ్రైవర్) ఉద్యోగాలకు 10శాతం ప్రత్యేక రిజర్వేషన్ హోంగార్డుల కు వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఈ కేటగిరీలో డ్రైవర్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు హోంగార్డులకు ఉన్న రిజర్వేషన్ సవరిస్తూ హోంశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. ఇతర ప్రత్యేక కేటగిరీలకు సంబంధించిన రిజర్వేషన్లు యథావిధిగా



కొనసాగుతాయని అందులో పేర్కొంది. దీనివల్ల ఇప్పుడు జరిగే రిక్రూట్‌మెంట్‌లో హోంగార్డులకు ప్రయోజనం చేకూరనుంది. కానిస్టేబుల్ స్టయిఫండరీ ట్రైనీ (డ్రైవర్) ఉద్యోగ నియామకాల్లో అవకాశాలను దక్కించుకునేందుకు ఉపయోగపడనుంది.



### ఈ సీజన్‌లో తొలిసారి

# ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద

విజయవాడ: కృష్ణానదికి జలకళ వచ్చింది. ఈ సీజన్‌లో తొలిసారిగా ప్రకాశం బ్యారేజీ కి భారీగా వరద ప్రవాహం చేరుతోంది. వాయుగుండం ప్రభావంతో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎగువన ఉన్న వాగులు పొంగి.. ప్రకాశం బ్యారేజీ రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం 55 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, దిగువకు 47 వేల క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 2,500, తూర్పు డెల్టాకు 5 వేల క్యూసెక్కులు, గుంటూరు ఛానెల్‌కు 250 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక అల్లాడుతున్న రైతాంగానికి.. వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలు ఊరటనిచ్చాయి. బుడమేరు, కట్టలేరు, మున్నేరు, పాములేరు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నాలుగు వాగుల నుంచి ప్రకాశం బ్యారేజీకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది.

### ఏపీలో డిజివెరిఫై ప్లాట్‌ఫామ్ ద్వారా

# ప్రభుత్వ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

అమరావతి: రాష్ట్రంలో వివిధ అవసరాల కోసం ధ్రువపత్రాల తనిఖీలకు ఇకపై ఏపీ డిజివెరిఫై ప్లాట్ ఫామ్ ను ఉపయోగించాలని ప్రభుత్వం ఆదేశించింది. విద్యా సంస్థల ప్రవేశాల దగ్గర నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలను పొందేందుకు వినియోగించే సర్టిఫికెట్లను ఇకపై మాన్యువల్ వెరిఫికేషన్ కాకుండా ఈ ప్లాట్ ఫామ్ ద్వారానే జరగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ



చేశారు. డిజిటల్ రూపంలోనే సర్టిఫికెట్లు జారీ అవుతున్న దృష్ట్యా.. ఫిజికల్ కాపీలు కాకుండా ఈ ప్లాట్ ఫామ్ ద్వారా ధ్రువీకరణ పూర్తి చేయాలని, దాని వల్ల నకిలీలకు అవకాశం లేకుండా ప్రభుత్వ వెబ్ సైట్ లో నేరుగా చూసేందుకు, వెంటనే నిర్ధరణకు ఉపకరిస్తుందని ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వం జారీ చేసే సర్టిఫికెట్లు అన్నింటిని వెరిఫై చేయడానికి దీనినే ఉపయోగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏపీ డిజివెరిఫై ప్లాట్ ఫామ్‌లో లేని ధ్రువపత్రాలను మాత్రమే మాన్యువల్‌గా పరిశీలించేందుకు అనుమతిస్తామని తెలిపారు.

### మూడు రాజధానులను సవాల్ చేస్తూ

# వేసిన వ్యాజ్యాలు నిరర్థకం: హైకోర్టు

అమరావతి: అమరావతిని ఏపీ రాజధానిగా ప్రకటిస్తూ పార్లమెంట్ చట్టం తీసుకొచ్చిన నేపథ్యంలో.. 3 రాజధానుల చట్టాన్ని సవాల్ చేస్తూ వేసిన వ్యాజ్యాలు నిరర్థకమవుతాయని హైకోర్టు స్పష్టం చేసింది. అమరావతికి సంబంధించి దాఖలైన వ్యాజ్యాలపై ఇవాళ హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అమరావతి నుంచి రాజధాని తరలిస్తున్నారని, 3 రాజధానులుగా విభజిస్తున్నారని, మౌలిక వసతులు, ప్లాట్లు ఇలా



రకరకాల అంశాలపై పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. రాజధాని ఇక్కడి నుంచి తరలించడానికి వీల్లేదని గతంలోనే తీర్పు ఇచ్చింది. ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరముందని స్పష్టం చేసింది. రాజధాని ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను తెలుసుకునేందుకు హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. రాజధానిపై గతంలో ప్రభుత్వం వేసిన అప్పీళ్లపై ఈనెల 29న సుప్రీంకోర్టులో విచారణకు వచ్చే అవకాశముందని, సుప్రీంకోర్టులో విచారణ దృష్ట్యా ఆ వ్యాజ్యాలను వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు తెలిపింది. మరోవైపు రాజధానిలో మౌలిక సౌకర్యాలు, ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని ఏజీ తెలిపారు.

# వరదనీటిలో కొట్టుకుపోయిన ఎమ్మెల్యే కూన రవికుమార్, జిల్లా కలెక్టర్, ఎస్పీ.. కాపాడిన ఎన్డీఆర్‌ఎఫ్

- **వాయుగుండం కారణంగా ఉత్తరాంధ్రలో కుండపోత వర్షా లు**
- **వరద పరిస్థితిని సమీక్షించేందుకు వెళ్లిన ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ**
- **వరదలో చిక్కుకున్న గర్భిణీని రక్షించిన ఎన్డీఆర్‌ఎఫ్**

ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వాయుగుండం దాటికి ఎడతెరిపి లేని కుండపోత వర్షాలు కురుస్తుండటంతో ఆకస్మిక వరదలు ఉప్పొంగాయి. ఈ క్రమంలో శ్రీకాకుళం జిల్లాలో వరద పరిస్థితులను సమీక్షించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే





కూన రవికుమార్, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు ఊహించని ప్రమాదానికి గురయ్యారు. వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్, ఎస్పీలు వరద నీటిలో కొట్టుకుపోయారు. ఈ ఆకస్మిక పరిణామంతో అక్కడున్న వారంతా తీవ్ర తీవ్ర భయాందోళనకు గురికాగా, వెంటనే రంగంలోకి దిగిన ఎన్డీఆర్‌ఎఫ్ , ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు అత్యంత సమయస్ఫూర్తితో వ్యవహరించాయి. లైఫ్ బోట్లలో వెళ్లి కొట్టుకుపోతున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీలను అత్యంత సాహసోపేతంగా రక్షించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి. మరోవైపు, పార్వతీపురం మన్యం జిల్లాలో వరద ముంపులో చిక్కుకున్న 9 నెలల గర్భిణీ భూమికను ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది లైఫ్ జాకెట్ తొడిగి సురక్షితంగా రక్షించారు. అనంతరం ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

# ఏపీలో వర్ష బీభత్సం..

# అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

- **తీవ్ర వాయుగుండం వల్ల రాష్ట్రంలో పంట నష్టంపై తక్షణ అంచనాకు ఆదేశం**
- **పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు సూచన**
- **ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మంత్రి అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్**
- **పొలాల్లోని నీటిని తొలగిస్తూనే, భవిష్యత్తు కోసం నిల్వ చేయాలని దిశానిర్దేశం**
- **రైతులకు సాంకేతిక సలహాలు అందించి అండగా నిలవాలని స్పష్టం**

తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్టు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. దెబ్బతిన్న రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేసినట్టు ఆయన వెల్లడించారు. క్షేత్రస్థాయిలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా



సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఆయన ఉన్నతాధికారులతో శుక్రవారం ప్రత్యేక టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బూడితి రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో పాటు పార్వతీపురం మన్యం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టంపై వెంటనే క్షేత్రస్థాయి సర్వే ప్రారంభించి, వివరాల నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు. పొలాల్లో నిలిచిన నీటిని తొలగించడం, అధిక తేమ వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించి, వారిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా దెబ్బతిన్న ముఖ్యమైన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను సమీక్షించాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీటిని సాధ్యమైనంత మేర సంరక్షించుకోవాలని మంత్రి సూచించారు. పంటలకు హాని కలిగించే చోట నీటిని తొలగిస్తూనే, చెరువులు, జలాశయాలు, ఇతర నీటి వనరుల్లో నీటిని నిల్వ చేసి భవిష్యత్తు సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు, ప్రజలకు నిరంతర సహాయం అందించాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు.

# మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: పెమ్మసాని

- **విజయవాడలో తొలిసారి నేషనల్ సరస్ ప్రదర్శన**
- **ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**
- **మహిళా సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని వ్యాఖ్య**

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, వారి ఆర్థిక సాధికారతను పెంపొందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'నేషనల్ సరస్ ప్రదర్శన' ఏర్పాట్లను రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన మార్కెట్ సౌకర్యాన్ని కల్పించడమే ధ్యేయంగా నేషనల్ సరస్ మేళాను ఢిల్లీ నుంచి విజయవాడకు తీసుకువచ్చామని తెలిపారు.



దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే మహిళా పారిశ్రామికవేత్తల కోసం 350కి పైగా స్టాళ్లను సిద్ధం చేస్తున్నామని, ఇందులో ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే సుమారు 250 స్టాళ్లు ఉండబోతున్నాయని చెప్పారు. ఇతర రాష్ట్రాల విజయగాథలు, అనుభవాలను పంచుకునేలా ఈ మేళాను ఒక ప్రత్యేక 'లెర్నింగ్ సెంటర్'గా మలుస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు తయారు చేసే నాణ్యమైన ఉత్పత్తులకు గుర్తింపు కల్పించేందుకు 'స్వయం ఏపీ' అనే ప్రతిష్ఠాత్మక బ్రాండ్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. దీని ద్వారా బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ అంశాల్లో మహిళలకు అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. దసరా ఉత్సవాల వేళ విజయవాడకు ఈ ఈవెంట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని, సందర్శకుల సౌకర్యాలు, భద్రత మరియు పార్కింగ్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులతో విస్తృత సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

# బ్యాంకుల సమ్మె ఎఫెక్ట్.. ఏపీలో మారిన పింఛన్ల పంపిణీ షెడ్యూల్

ఏపీలో అక్టోబర్ నెలకు సంబంధించిన 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ సమయంలో స్వల్ప మార్పు చోటుచేసుకుంది. ప్రతి నెలా 1వ తేదీ ఉదయం ప్రారంభమయ్యే పింఛన్ల పంపిణీ, ఈసారి మాత్రం మధ్యాహ్నం నుంచి మొదలుకానుంది. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఈ నెల చివరి వారంలో బ్యాంకులకు వరుస సెలవులు, సమ్మె ఉండటమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. సెప్టెంబర్ 26న బ్యాంకులకు సెలవు కాగా, 28, 29, 30 తేదీల్లో బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 1వ తేదీ ఉదయం స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు బ్యాంకులకు వెళ్లి పింఛన్లకు అవసరమైన నగదును విత్‌డ్రా చేస్తారు. అనంతరం మధ్యాహ్నం నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ డబ్బులను పంపిణీ చేయనున్నారు. అక్టోబర్ నెలకు గాను రాష్ట్రవ్యాప్తంగా 61.80 లక్షల మంది పింఛన్ లబ్ధిదారుల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.2,692 కోట్లను విడుదల చేసింది. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. ఇదిలా ఉంటే.. జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్ఎస్ఏపీ) కింద కేంద్రం ఇచ్చే నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పైలట్ ప్రాజెక్టును తొలుత విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలో ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో మొత్తం 9.34 లక్షల మంది లబ్ధిదారులు ఈ పథకంతో అనుసంధానమై ఉన్నారు.

# వంశధార, నాగావళికి పోటెత్తిన వరద.. మొదటి ప్రమాద హెచ్చరికలు జారీ

- **భారీ వర్షా లతో వంశధార, నాగావళి నదులకు వరద ఉద్ధృతి**
- **గొట్టా బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ**
- **నారాయణపురం ఆనకట్ట వద్ద కూడా మొదటి ప్రమాద హెచ్చరిక**
- **నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన**
- **నదుల్లోకి ఈత, చేపల వేటకు వెళ్లొద్దని విపత్తుల సంస్థ హెచ్చరిక**

భారీ వర్షాల నేపథ్యంలో ఉత్తరాంధ్రలోని ప్రధాన నదులైన వంశధార, నాగావళిలో వరద ఉద్ధృ క్రమంగా పెరుగుతోంది. నదీ ప్రవాహం పోటెత్తుతుండటంతో అధికారులు ప్రధాన బ్యారేజీల వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ క్రమంలో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. వంశధార నదిపై ఉన్న గొట్టా బ్యారేజ్ వద్ద అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ప్రస్తుతం ఈ బ్యారేజ్‌లోకి 41,014 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, అంతే మొత్తంలో నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. మరోవైపు నాగావళి నదిలోనూ వరద ప్రవాహం కొనసాగుతోంది. తోటపల్లి బ్యారేజ్ వద్ద ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 45,661 క్యూసెక్కులుగా నమోదవుతోంది. నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్ట వద్ద ప్రవాహం 59,700 క్యూసెక్కులకు చేరడంతో అధికారులు అక్కడ కూడా మొదటి ప్రమాద హెచ్చరికను అమలులోకి తెచ్చారు. ఈ పరిస్థితులపై రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ స్పందిస్తూ..నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వరద తీవ్రత దృష్ట్యా నదుల్లోకి ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం వంటి పనులు అత్యంత ప్రమాదకరమని, అటువంటి వాటికి దూరంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.



## ఏపీలో కీలక అధికారుల బదిలీలపై అక్టోబర్ 9 వరకు నిషేధం

- **అధికారుల బదిలీలపై నిషేధం పొడిగించిన ప్రభుత్వం**
- **ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పనులే కారణం**
- **ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ విధుల్లో పాల్గొంటున్న కీలక అధికారుల బదిలీలను అక్టోబర్ 9 వరకు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వివేక్ యాదవ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి




సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిషేధం రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ విధుల్లో నిమగ్నమైన అధికారులందరికీ వర్తిస్తుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూసేందుకే ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. దీంతో, అక్టోబర్ 9 వరకు సంబంధిత అధికారులను బదిలీ చేయడం లేదా వారికి కొత్త పోస్టింగ్‌లు ఇవ్వడం సాధ్యపడదు.

## నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు..
## 37 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం: నాదెండ్ల మనోహర్

- **విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాప్**
- **రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్న నాదెండ్ల**
- **ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడి**

ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని నవంబర్ 1న ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో పౌరసరఫరాల శాఖ నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడిన ఆయన, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు, రవాణా, మిల్లింగ్ ప్రక్రియకు



సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. సేకరణ ప్రక్రియ కోసం 24 వేల మంది సిబ్బందిని నియమించగా, కల్లాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడించారు. ఈసారి రైతులకు రవాణా ఖర్చులు కూడా చెల్లించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా పంట దిగుబడులు, తద్వారా ధాన్యం సేకరణ అంచనాలు తగ్గినట్లు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అయినప్పటికీ, రైతుల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా సకాలంలో కొనుగోలు చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రవాణా, గోనె సంచుల సరఫరా, మిల్లుల సామర్థ్యం, చెల్లింపుల ప్రక్రియ వంటి అంశాల్లో పౌరసరఫరాల శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలను భాగస్వామ్యం చేసేందుకే ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన తర్వాత చెల్లింపులు ఆలస్యం కాకుండా ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని చెప్పారు.

## ఒమన్ నుంచి చిత్తూరు మహిళ కన్నీటి వేడుకోలు.. స్పందించిన మంత్రి నారా లోకేశ్

- **ఒమన్‌లో చిక్కుకున్న చిత్తూరు జిల్లా మహిళ గ్రంధి ఇందిర**
- **ఆమెను ఆదుకోవాలంటూ సోషల్ మీడియాలో నెటిజన్ విజ్ఞప్తి**
- **కన్నీటి పర్యంతమవుతున్న మహిళ వీడియోను షేర్ చేసిన నెటిజన్**
- **విజ్ఞప్తిపై తక్షణమే స్పందించిన మంత్రి నారా లోకేశ్**
- **ఇందిరను సురక్షితంగా రప్పిస్తామని హామీ, రంగంలోకి మంత్రి కార్యాలయం**

ఒమన్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్న చిత్తూరు జిల్లా మహిళను ఆదుకునేందుకు ఏపీ మంత్రి నారా లోకేశ్ ముందుకు వచ్చారు. బాధితురాలిని సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నామని ఆయన హామీ ఇచ్చారు. సోషల్ మీడియా వేదికగా వచ్చిన ఒక విజ్ఞప్తిపై మంత్రి వెంటనే స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు జిల్లా, రాళ్లూరు గ్రామానికి చెందిన గ్రంధి ఇందిర ఉపాధి కోసం ఒమన్ వెళ్లారు. అక్కడ ఆమె శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తనను స్వదేశానికి తీసుకురావాలని వేడుకుంటున్న వీడియోను ఒక నెటిజన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "నారా లోకేశ్ అన్నా, దయచేసి ఈమెను తిరిగి స్వదేశానికి రప్పించడంలో



సహాయం చేయండి" అంటూ ఆ వీడియోతో పాటు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ పోస్ట్‌పై మంత్రి నారా లోకేశ్ తక్షణమే స్పందించారు. "ఒమన్‌లో శ్రీమతి గ్రంధి ఇందిర ఎదుర్కొంటున్న బాధాకరమైన పరిస్థితిని మా దృష్టికి తెచ్చినందుకు ధన్యవాదాలు. ఆమె క్షేమంగా ఉండటమే మా ప్రథమ ప్రాధాన్యత. ఈ విషయంపై నా కార్యాలయం తక్షణమే స్పందించి, ఆమెను సురక్షితంగా భారతదేశానికి తిరిగి తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుంది" అని లోకేశ్ భరోసా ఇచ్చారు. మంత్రి కార్యాలయం ఇప్పటికే ఈ విషయంపై దృష్టి సారించిందని, ఇందిరను క్షేమంగా తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించిందని ఆయన స్పష్టం చేశారు. మంత్రి నుంచి తక్షణ స్పందన రావడంతో ఆమె కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

## ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర.. మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు

- **అర్హులైన ఓటర్లకూ నోటీసులిస్తున్నారని విమర్శ**
- **గతంలో పలుమార్లు ఓటు వేసిన వారినీ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణ**
- **సీఈసీ పదవి నుంచి జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్**
- **అర్హులందరికీ ఓటు హక్కు ఉండాలన్న మహేశ్ గౌడ్**

అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. పౌరులకు నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ డిమాండ్ చేసినట్టుగా ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు. లేకపోతే వారిని ప్రభుత్వం అరెస్టు చేయాలని



డిమాండ్ చేశారు. ఈ దేశంలో పుట్టిన పౌరులకు, గతంలో పలుమార్లు ఓటు వేసిన వారికి కూడా నోటీసులు ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలని అన్నారు. నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జనం అతిపెద్ద పండుగల్లో ఒకటని మహేశ్ కుమార్ చెప్పారు. గణనాథుడిని సాగనంపుతూ రాష్ట్రం వ్యవసాయం, ఆరోగ్యం, విద్య సహా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కోరుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిగా అందాలని ఆకాంక్షించారు. మరోసారి ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్‌కు ఉండాలని కోరుకున్నామని చెప్పారు.

## రూ.39 లక్షలకు బాలాపూర్ లడ్డూ.. ఈసారి అదృష్టం ఎవరిని వరించిందంటే..!

- **ముగిసిన బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం**
- **దక్కించుకున్న సామ ప్రణీత్ రెడ్డి**
- **ఈసారి వేలంలో 9 మంది**
- **పోటీపోటీగా పెరిగిన బిడ్లు**
- **లడ్డూను దక్కించుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయనే నమ్మకం**

హైదరాబాద్ వినాయక ఉత్సవాల్లో ఎంతో ప్రత్యేకమైన బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం పాట ముగిసింది. ఈసారి లడ్డూకు భారీ ధర పలికింది. సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి రూ.39 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. దీంతో బాలాపూర్ లడ్డూ వేలంలో కొత్త రికార్డు నమోదైంది.



ప్రతి ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలంపై భక్తుల్లో భారీ ఆసక్తి ఉంటుంది. ఈసారి కూడా లడ్డూను దక్కించుకునేందుకు 9 మంది భక్తులు వేలంలో పాల్గొన్నారు. ఒకరిని మించి మరొకరు బిడ్ పెంచడంతో వేలం ఉత్కంఠగా సాగింది. చివరికి రూ.39 లక్షల వద్ద సామ ప్రణీత్ రెడ్డి లడ్డూను సొంతం చేసుకున్నారు. లడ్డూను దక్కించుకున్న ప్రణీత్ రెడ్డిని ఉత్సవ నిర్వాహకులు, తోటి భక్తులు అభినందించారు. బాలాపూర్ గణేశుడి లడ్డూను దక్కించుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. దీంతో ప్రతి ఏడాది ఈ లడ్డూకు వేలంలో భారీ పోటీ నెలకొంటోంది.



## ఈ నెలాఖరు నాటికి 'సర్' ప్రక్రియ పూర్తి చేయండి: సుదర్శన్‌రెడ్డి

వికారాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 60 శాతం ఓటర్లకు నోటీసులు పంపిణీ చేశామని, ఈ నెలాఖరు నాటికి 'సర్' ప్రక్రియ పూర్తి చేయిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ దీపక్ తివారితో కలిసి వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి, శివారెడ్డిపేట, తాండూరులో పర్యటించారు. జిల్లాలో చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు ఎన్ని నోటీసులు జారీ చేశారు. ఇంకా ఇవ్వాల్సిన నోటీసులు ఎన్ని అని బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈఆర్వోలు, తహసీల్దార్లతో సమీక్షించారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరును జాబితా నుంచి తొలగించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాజకీయ నాయకులతో సమావేశాలు నిర్వహించాలని ప్రతి దశను సమర్థంగా పూర్తి చేయాలన్నారు. ముందుగా కలెక్టరేట్‌లో పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, శిక్షణ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, డీఎస్పీ అంజయ్య, డీఆర్వో స్వర్ణలత, ఆర్డీవోలు వాసుచంద్ర, అనిత, వికారాబాద్, పరిగి, కొడంగల్ పుర కమిషనర్లు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## డీఎస్పీ భీమ్‌రెడ్డి కేసు: ఏసీబీ దాడుల్లో బయటపడుతున్న బినామీలు

- **డీఎస్పీ భీమ్‌రెడ్డి ఆస్తుల కేసులో బినామీలపై ఏసీబీ దాడులు**
- **హైదరాబాద్, జహీరాబాద్‌లలో సోదాలు**
- **రూ.400 కోట్ల ఆస్తుల ఆధారాలు సేకరణ**
- **బిల్డర్ ఇంట్లో రూ.1.35 కోట్ల నగదు, విదేశీ కరెన్సీ స్వాధీనం**
- **మాజీ హోంగార్డు, ఆడిటర్ కార్యాలయాల్లో కీలక పత్రాల సీజ్**
- **ఏసీబీ రాకతో విల్లా అమ్మిన వ్యక్తి పరారీ**



ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన డీఎస్పీ భీమ్‌రెడ్డి వ్యవహారంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఆయన బినామీలే లక్ష్యంగా ఏసీబీ అధికారులు గురువారం ఏకకాలంలో పంజా విసిరారు. హైదరాబాద్, జహీరాబాద్‌లలోని పది ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి, రూ.400 కోట్ల ఆస్తులకు సంబంధించిన కీలక ఆధారాలను సేకరించారు. పుప్పాలగూడలో ఉండే బిల్డర్ వీరబొమ్మ వెంకటేష్ ఇంట్లో జరిపిన సోదాల్లో అధికారులు రూ.1.35 కోట్ల నగదుతో పాటు విదేశీ కరెన్సీ, 14 విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. భీమ్‌రెడ్డి తరపున నిర్మాణ రంగంలో వెంకటేష్ పెట్టుబడులు పెట్టినట్లు ఏసీబీ అనుమానిస్తోంది. గతంలో టోలిచౌకిలో బియ్యం వ్యాపారం చేసిన ఆయన.. భీమ్‌రెడ్డితో పరిచయం తర్వాత కోటీశ్వరుడిగా మారిన తీరుపై అధికారులు ఆరా తీస్తున్నారు. మరోవైపు, జహీరాబాద్‌లో భీమ్‌రెడ్డి ఆస్తులను చూసుకుంటున్న మాజీ హోంగార్డు లక్ష్మణ్ నాయక్ ఇల్లు, కార్యాలయంలో సోదాలు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. పటాన్‌చెరులో భీమ్‌రెడ్డి వద్ద హోంగార్డుగా పనిచేసిన లక్ష్మణ్, ఆ తర్వాత ఉద్యోగం మానేసి బంగారు నగల దుకాణం పెట్టి ధనవంతుడిగా మారినట్లు గుర్తించారు. భీమ్‌రెడ్డి ఆర్థిక వ్యవహారాలు చూసే ఆడిటర్ కార్యాలయంలోనూ డిజిటల్ ఆధారాలను సేకరించారు. ఈ కేసులో మరో కీలక వ్యక్తి, భీమ్‌రెడ్డికి ఇబ్రహీంబాగ్‌లో విల్లా అమ్మిన మాధవరావు.. ఏసీబీ అధికారులు వస్తున్నారని తెలిసి మార్నింగ్ వాక్ అని చెప్పి ఇంటి నుంచి వెళ్లి పరారయ్యారు. భీమ్‌రెడ్డి అరెస్ట్ తర్వాత పలువురు బినామీలు తమ ఫోన్లను ధ్వంసం చేసి సాక్ష్యాలను నాశనం చేసే ప్రయత్నం చేసినట్లు కూడా ఏసీబీ గుర్తించింది. ప్రస్తుతం కొందరి విచారణ మాత్రమే పూర్తికాగా, ఈ కేసులో మరికొంతమందిపై నిఘా పెట్టినట్లు సమాచారం.

# నా కొడుకుని ఉరితీయండి!.. అత్యాచార కేసు నిందితుడి తల్లి

మహారాష్ట్రలో ఓ వివాహితను బెదిరించి అత్యాచారం చేసిన కేసులో నిందితుడిగా ఉన్న కానిస్టేబుల్‌ను ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించారు. ఈ విషయంపై నిందితుడి తల్లి మీడియాతో మాట్లాడుతూ.. తన కుమారుడు గతంలో అనేక మంది మహిళలను ఇలాగే వేధించాడని ఆరోపించారు. అతడికి మరణశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకొని తననూ వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఠాణే జిల్లా భీవండిలో సెప్టెంబర్ 13న ఓ వివాహితపై సామూహిక అత్యాచార ఘటన సంచలనం సృష్టించింది. ఈ కేసులో కానిస్టేబుల్ శైలేష్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే నరేంద్ర పవార్‌లు నిందితులుగా ఉన్నారు. బాధితురాలి నుదుటపై తుపాకీ పెట్టి బెదిరించి, మద్యం తాగించి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసును ఇటీవల విచారించిన స్థానిక



న్యాయస్థానం.. మాజీ ఎమ్మెల్యేకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. సహ నిందితుడిగా ఉన్న శైలేష్‌ను అధికారులు ఇప్పటికే విధుల నుంచి తొలగించారు. కేవలం భీవండి కేసు కాకుండా.. తన కుమారుడు గతంలో అనేక మంది మహిళలను ఇలాగే బెదిరించాడని తల్లి సులోచన పాటిల్ అన్నారు. ఓ సీనియర్ ఐపీఎస్ అధికారిని కాపాడేందుకు నెపాన్ని తనపై వేసుకొని జైలుకు కూడా వెళ్లాడని తెలిపారు. ఆర్థర్ జైల్లో ఉన్నప్పుడు కరడుగట్టిన నేరస్థులతో అతడికి పరిచయం పెరిగిందని, అప్పటినుంచి నేర చరిత్ర మొదలైందని ఆమె వివరించారు. శైలేష్ తనను తుపాకీతో బెదిరించి ఆస్తులన్నీ స్వాధీనం చేసుకున్నాడని ఆరోపించారు. ఎన్నో హేయమైన ఘటనలకు పాల్పడిన తన కుమారుడిని ఉరితీయాలని, తన ఆస్తులను ఇప్పించాలని ఉన్నతాధికారులకు సులోచన విజ్ఞప్తి చేశారు.

## ఆ మృత్యు బస్సుపై..
# మూడేళ్లలో 61 చలాన్లు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని యమునా ఎక్స్‌ప్రెస్ వేపై స్లీపర్ బస్సుకు మంటలు అంటుకోవడంతో 9 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే, బిహార్ రిజిస్ట్రేషన్ ఉన్న ఈ బస్సు అనేక సార్లు నిబంధనలు ఉల్లంఘించినట్లు వెల్లడైంది. ఏప్రిల్ 2023 నుంచి ఆగస్టు 2026 మధ్యకాలంలోనే 61 చలాన్లు జారీ అయినట్లు తేలింది. వీటిలో 19 చలాన్లు ఇంకా చెల్లించలేదని, ఈ పెండింగ్ జరిమానాల మొత్తం రూ.1.75లక్షలుగా ఉందని అధికారులు గుర్తించారు. బస్సు కూడా నిర్ణీత ఎత్తు కన్నా ఎక్కువే ఉన్నట్లు అధికారుల పరిశీలనలో వెల్లడైంది. అంతేకాదు.. ఎమర్జెన్సీ మార్గం వద్దా



నిబంధనలకు విరుద్ధంగా స్లీపర్ బెర్త్ ఉందని, ప్రయాణికులు తప్పించుకునేందుకు ఇది ఆటంకం కలిగించి ఉండవచ్చని భావిస్తున్నారు. వీటితోపాటు బస్సులో ఉన్న సౌందర్య సాధనాలుకూ మంటల తీవ్రతకు కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. స్లీపర్ టూరిస్ట్ బస్సు దిల్లీ నుంచి ఉత్తర్ ప్రదేశ్‌లోని మహోబావైపు వెళ్తుండగా.. యమునా ఎక్స్‌ప్రెస్‌వే వైపు వెళ్తుండగా మంటలు అంటుకున్నాయి. అవి వేగంగా బస్సు అంతా వ్యాపించాయి. ఆ సమయంలో అందులో 40 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది. ప్రాణాలు కాపాడుకునేందుకు పలువురు బస్సు నుంచి దూకేయగా.. కొందరు నిద్రలో ఉండటంతో మంటల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయారు.

# దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలు.. పలుచోట్ల జలఫిరంగుల ప్రయోగం

దిల్లీ: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష కాంగ్రెస్ దేశవ్యాప్తంగా పలుచోట్ల నిరసనలు చేపట్టింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ నేతలు నినాదాలు చేశారు. ఈ క్రమంలో దిల్లీలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బారికేడ్లను తొలగించుకొని ఎన్నికల కమిషన్ కార్యాలయం వైపు దూసుకెళ్లారు. పోలీసులు వారిని అడ్డుకొని



నిర్బంధించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ప్రజాస్వామ్యం నాశనమవుతుంటే చూస్తూ కూర్చోబోమని దిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ అన్నారు. అంతకుముందు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రూపంలో ఉన్న మాస్క్‌లను ధరించి.. యూత్ కాంగ్రెస్ నేతలు దిల్లీలో ఆందోళన చేపట్టారు. ఆందోళనల నేపథ్యంలో అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్‌ను పోలీసులు నిర్బంధించారు. బిహార్ రాజధాని పట్నా, చండీగఢ్‌లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు జలఫిరంగులు ప్రయోగించారు. ఇదే తరహా ఆందోళనలు కోల్‌కతా, జమ్మూ తదితర ప్రాంతాల్లోనూ జరిగాయి.

# 27 ఏళ్ల పాటు ప్రయత్నించి.. 59 ఏళ్లకు ఉపాధ్యాయ ఉద్యోగం

బాగ్‌పత్: ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేయాలన్నది ఆయన కల. అందుకోసం 1999 నుంచి ప్రయత్నాలు మొదలు పెట్టారు. దాదాపు 27 ఏళ్ల పాటు పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నిస్తూనే ఉన్నారు. చివరికి 59 ఏళ్ల వయసులో అనుకున్న ఉద్యోగం సాధించారు. ఇదీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని బాగ్‌పత్‌కు చెందిన విజయ్‌కుమార్ శర్మ అలుపెరుగని పోరాట ఫలితం. తన ప్రయత్నాల్లో భాగంగా విజయ్‌కుమార్ అనేక సార్లు రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించినా.. ఇంటర్వ్యూల్లోనే ఎదురుదెబ్బ తగిలేది. ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) పరీక్షలో ఆరుసార్లు, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) పరీక్షల్లో నాలుగు సార్లు ఉత్తీర్ణులయ్యారు. కానీ, ఇంటర్వ్యూల్లో ఫెయిలవ్వడంతో ప్రతిసారీ నిరాశే ఎదురయ్యేది. కానీ, తన ప్రయత్నాలను మాత్రం ఆయన ఆపలేదు. ఉపాధ్యాయుడిగా పనిచేయాలన్న తపనతో ఓ వైపు స్థానిక ప్రైవేటు పాఠశాలలో పని చేస్తూనే పోటీ పరీక్షలకు సన్నద్ధత కొనసాగించారు. రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌లో అక్కడి ప్రభుత్వం తాజాగా ఇంటర్వ్యూలను ఎత్తివేసింది. ఆ తర్వాత విడుదలైన టీచర్ పోస్టుల నియామక నోటిఫికేషన్‌లో విజయ్‌కుమార్ తన కలను సాకారం చేసుకున్నారు. టీజీటీ సంస్కృతం ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. యూపీలో



ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లు కావడంతో... దాదాపు మూడేళ్లు ఆయన ఉపాధ్యాయుడిగా కొనసాగే అవకాశం ఉంది.

## ఆల్కహాల్ టెస్టులో విఫలం..
# ఎయిరిండియా కోపైలట్‌పై సస్పెన్షన్ వేటు

ఆల్కహాల్ పరీక్షలో విఫలమైన ఎయిరిండియా కోపైలట్‌పై విమానయాన సంస్థ సస్పెన్షన్ వేటు వేసింది. జ్యూరిక్‌దిల్లీ విమాన ప్రయాణానికి ముందు నిర్వహించిన ఆల్కహాల్ పరీక్షలో పాజిటివ్ రావడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. కోపైలట్ మద్యం సేవించినట్లు అనుమానించిన అధికారులు అతడికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించారని, అందులో విఫలం కావడంతో టేకాఫ్‌కు ముందే అతడిని తప్పించామని వెల్లడించింది. మరుసటి రోజు సాధారణ ప్రయాణికుడిగా భారత్‌కు పంపించామని.. తుది నివేదిక వచ్చేవరకు అతడు సస్పెన్షన్‌లోనే ఉంటారని ఎయిరిండియా వెల్లడించింది. సెప్టెంబర్ 6న స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ ఎయిర్‌పోర్టు నుంచి దిల్లీకి బయలుదేరేందుకు ఏఐ 151 విమానం సిద్ధం కాగా.. పైలట్ మద్యం సేవించినట్లు క్షేత్రస్థాయి సిబ్బంది అనుమానించారు. ఈ విషయాన్ని




ఉన్నతాధికారులకు తెలియజేయడంతో ఆల్కహాల్ టెస్టు నిర్వహించారు. ప్రాథమిక పరీక్షల్లో విఫలం కావడంతో రెండోసారి పరీక్షించారు. మత్తు పరీక్షలోనూ పరిమితికి మించి ఉండటంతో విమాన ప్రయాణాన్ని మరుసటి రోజుకు వాయిదా వేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి తుది నివేదిక ఇంకా రాలేదని ఎయిరిండియా వెల్లడించింది. భద్రతా ఉల్లంఘనలను ఉపేక్షించమని, కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఇటీవల థాయ్‌లాండ్ నుంచి దిల్లీ వచ్చే విమానం తీవ్ర కుదుపులకు లోనైన ఘటనలో పైలట్ డ్రగ్స్ తీసుకున్నట్లు తేలిన విషయం తెలిసిందే.

# ప్రతిపక్షాలు ఎన్నికల్లో పోటీ చేయొద్దు..: అభిజీత్ దీప్కే

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) విషయంపై ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు భావిస్తే.. ఇకపై ఎన్నికల్లో పోటీ చేయడం మానుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో (Elections) రిగ్గింగ్ జరుగుతుందనేది ముమ్మాటికీ నిజమేనని ఆరోపించారు. అయితే, ప్రతిపక్షాలు ఎన్నికల్లో పాల్గొనడంతో.. అవి స్వేచ్ఛగా, పారదర్శకంగా జరుగుతున్నాయనే భావన ప్రజల్లో కలుగుతోందన్నారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని పదేపదే ఆరోపిస్తున్నప్పటికీ.. ప్రతిపక్ష పార్టీలు ఎందుకు పోటీ చేస్తున్నాయని




ప్రశ్నించారు. ''మీరు ఎన్నికల్లో పోటీ చేయకపోతే మీ ఉనికికే ముప్పు వాటిల్లుతుందనే భయంతో పోటీ చేస్తుండొచ్చు. కానీ ఓట్లు దొంగిలిస్తున్నప్పుడు.. మీ ఎమ్మెల్యేలు, ఎంపీలను ప్రలోభపెడుతున్నప్పుడు.. మీ పార్టీలు చీలిపోతున్నప్పుడు.. మీరు ఇంకా ఎలాంటి ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు?. ఆట మోసపూరితమైందని చెబుతున్నప్పుడు.. దానిని కొనసాగించడం తప్పు. ఇప్పటికైనా ఇటువంటి మోసపూరిత ఎన్నికల్లో పోటీ చేయడం ఆపండి. రాజకీయ మనుగడకు కాకుండా.. దేశంలోని ప్రజాస్వామ్య ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వండి' అని అభిజీత్ సూచించారు.

**24 గంటల్లో సీఈసీ రాజీనామా చేయాలి**

సర్‌లో అవకతవకలకు బాధ్యత వహిస్తూ.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ 24 గంటల్లో రాజీనామా చేయాలని దీప్కే డిమాండ్ చేశారు. లేదంటే అక్టోబర్ 2 నుంచి జంతర్ మంతర్ వద్ద మరోసారి నిరసన కార్యక్రమాన్ని చేపడతామని ప్రకటించారు. ప్రజాస్వామ్యానికి సీఈసీ ఓ ముప్పులా తయారయ్యారన్నారు.

## అరుదైన కానుక.. అమెరికన్‌చైనీస్ రుచులు
# జిన్‌పింగ్‌కు ట్రంప్ ప్రత్యేక డిన్నర్

అమెరికా పర్యటనకు విచ్చేసిన చైనా అధినేత షీ జిన్‌పింగ్‌కు అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దంపతులు అధికారిక విందు ఇచ్చారు. శ్వేతసౌధంలోని ఈస్ట్ రూమ్‌లో జరిగిన ఈ విలాసవంతమైన విందులో జిన్‌పింగ్ కోసం ప్రత్యేక వంటకాలు సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన మెనూను వైట్‌హౌస్ విడుదల చేసింది. అమెరికన్, చైనీస్ రుచుల కలయికతో చేసిన వంటకాలు అందులో ఉన్నాయి. మెయిన్ కోర్సులో నువ్వులతో చేసిన బాస్ చేప, క్రిస్పీ బాక్ చోయ్ (ఒక రకమైన చైనీస్ క్యాబేజీ), పసుపు గుమ్మడితో చేసిన వెలౌట్, అడవి పుట్టగొడుగులతో చేసిన ఫ్రికాసీ, క్రిస్పీ పాన్‌సెట్టా, రోస్టెడ్ గార్డెన్ ఎగ్‌ప్లాండ్ వంటివి ఏర్పాటు చేశారు. డెజర్ట్స్‌లో వెనీలా క్రిమెక్స్, వైట్‌హౌస్ హనీ క్రీమ్, వాల్‌నట్ ఫ్రాంగిపేన్, చెర్రీ కాన్‌ఫిట్ వంటివి అందించారు.

**కానుకగా అరుదైన బొమ్మ..**

ఇక, ఈ కార్యక్రమంలో జిన్‌పింగ్‌కు ట్రంప్ అరుదైన కానుకనిచ్చారు. అమెరికా జాతీయ బాల్డ్ ఈగల్ విగ్రహాన్ని బహుమతిగా అందజేశారు. మూడు అడుగుల ఎత్తు ఉన్న ఈ గిఫ్ట్‌ను విందు సమయంలో అతిథుల ముందు ప్రదర్శించారు. స్వేచ్ఛ, స్ఫూర్తికి చిహ్నమైన ఈ విగ్రహం.. చైనాలో ప్రత్యేకంగా నిలుస్తుందని ట్రంప్ ఆకాంక్షించారు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా 'సుప్రీం'లో పిటిషన్

'సర్' అంశంపై ఎన్నికల కమిషన్ లో విభేదాలు ఏర్పాడ్డాయంటూ వచ్చిన వార్తలపై రాజకీయ దుమారం తీవ్రమవుతోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అభిశంసనకు విపక్షాలు సిద్ధమవుతుండగా.. తాజాగా ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. జ్ఞానేశ్ కుమార్ కు వ్యతిరేకంగా సర్వోన్నత న్యాయస్థానం లో పిటిషన్ దాఖలైంది. ఆయనపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ కోరుతూ న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి పిటిషన్ వేశారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండా.. జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలు, జారీ చేసిన మార్గదర్శకాలు, చేపట్టిన సాఫ్ట్‌వేర్ మార్పులన్నీ రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలని పిటిషనర్ సుప్రీంకోర్టును కోరారు. సర్‌కు సంబంధించిన నిర్ణయాలు చట్టవిరుద్ధమని ప్రకటిస్తూ.. 'ఫామ్ 6'ను పునరుద్ధరించాలని అభ్యర్థించారు. సర్ ప్రక్రియ సమయంలో దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది పేర్లను ఎన్నికల జాబితా నుంచి తొలగించారన్న ఆరోపణలున్నాయని, వాటిపై సిట్‌తో దర్యాప్తు జరిపేలా ఆదేశాలివ్వాలని పిటిషనర్ కోరారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం విధుల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించినందుకు గానూ.. జ్ఞానేశ్ కుమార్‌తో పాటు, డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ మనీశ్




గార్గ్, ఈసీ ఐటీ హెడ్ సీమా ఖన్నాపై క్రిమినల్ విచారణ జరపాలని అభ్యర్థించారు.

* **జెన్-జీ ఓటు హక్కును అడ్డుకుంటున్నారు: కాంగ్రెస్**

మరోవైపు, ఈ వ్యవహారం నేపథ్యంలో సీఈసీపై కాంగ్రెస్ పార్టీ మరోసారి ఘాటు విమర్శలు చేసింది. జెన్‌జీకి ఓటు హక్కు కల్పించకుండా ఆయన అడ్డుకుంటున్నారని ఆరోపించింది. ''2024 నుంచి స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియను జ్ఞానేశ్ కుమార్ నిలిపివేశారు. ఈ ప్రక్రియతో 18ఏళ్లు నిండినవారు ఓటరు జాబితాలో చేరే అవకాశం ఉండేది. ఓవైపు, జెన్‌జీకి ఓటు హక్కు లేకుండా చేస్తూ.. మరోవైపు ఓటు బాధ్యతలపై ఆయన యువతకు ప్రచారం చేస్తుండటం సిగ్గుచేటు. ఇప్పుడు ఓటు చోరీ గురించి బయటపడిన తర్వాత సీఈసీ ప్రజలకు ముఖం చూపించలేకపోతున్నారు'' అని కాంగ్రెస్ విమర్శించింది.

# భారతీయులకు అర్జెంటీనా బంపర్ ఆఫర్.. వీసా లేకుండానే పర్యటన, ఉచితంగా బిజినెస్ వీసా!

- **యూఎస్ వీసా ఉన్న భారతీయులకు అర్జెంటీనా టూరిస్ట్ వీసా అవసరం లేదు**
- **భారత పౌరులకు ఐదేళ్ల వ్యాపార వీసాను ఉచితంగా అందిస్తున్నట్టు ప్రకటన**
- **విమాన సర్వీసుల ఒప్పందంపై చర్చలు.. రానున్న రోజుల్లో చౌకగా ప్రయాణం**
- **భారత్, అర్జెంటీనా మధ్య 6.5 బిలియన్ డాలర్లకు చేరిన ద్వైపాక్షిక వాణిజ్యం**

భారతీయ పర్యాటకులు, వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు దక్షిణ అమెరికా దేశం అర్జెంటీనా కీలక చర్యలు చేపట్టింది. భారతీయులకు తమ దేశంలో పర్యటించేందుకు, వ్యాపారం చేసేందుకు వీలుగా పలు ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఢిల్లీలో జరిగిన ఐకానిక్ టూరిజం సమ్మిట్ లో భారత్‌లో అర్జెంటీనా రాయబారి మరియానో కాసినో ఈ వివరాలను వెల్లడించారు. 2025 ఆగస్టు నుంచి అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనల ప్రకారం.. చెల్లుబాటు అయ్యే యూఎస్ వీసా కలిగిన భారతీయ పౌరులు ఇకపై అర్జెంటీనా వీసా లేకుండానే ఆ దేశంలో 90 రోజుల వరకు పర్యటించవచ్చని ఆయన తెలిపారు. ఇది భారతీయ పర్యాటకులకు గొప్ప అవకాశమని పేర్కొన్నారు. అంతేగాక భారతీయ పౌరుల కోసం ఐదేళ్ల కాలపరిమితితో కూడిన వ్యాపార వీసాను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని ప్రకటించారు. ''భారతీయులు మా దేశానికి రావాలి, వ్యాపారం చేయాలి, పెట్టుబడులు పెట్టాలి. పర్యాటకం, పెట్టుబడుల విషయంలో మా ద్వారాలు తెరిచే ఉంటాయి'' అని కాసినో స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య విమాన రాకపోకలను సులభతరం చేసేందుకు భారత్, అర్జెంటీనా పౌర విమానయాన శాఖల మధ్య 'ఎయిర్ సర్వీసెస్ అగ్రిమెంట్'పై చర్చలు జరుగుతున్నాయని రాయబారి తెలిపారు. ఈ ఒప్పందం పూర్తయితే విమానయాన సంస్థలకు మరిన్ని మార్గాల్లో సర్వీసులు నడిపే స్వేచ్ఛ లభిస్తుంది. కోడ్‌షేర్ ఒప్పందాలు, పెరిగిన పోటీ కారణంగా విమాన టిక్కెట్ల ధరలు కూడా తగ్గే అవకాశం ఉంది. అలాగే, అర్జెంటీనా అందిస్తున్న 'డిజిటల్ నొమాడ్ వీసా' గురించి కూడా కాసినో ప్రస్తావించారు. దీని ద్వారా రిమోట్‌గా పనిచేసే నిపుణులు ఆరు నెలల పాటు



అర్జెంటీనాలో నివసించవచ్చు, అవసరమైతే మరో ఆరు నెలలు పొడిగించుకోవచ్చు. భారత టెక్ నిపుణులు, అర్జెంటీనా స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ మధ్య సహకారానికి ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అర్జెంటీనాకు భారత్ ఆరవ అతిపెద్ద ఆర్థిక భాగస్వామిగా ఉంది. 2025లో ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 6.5 బిలియన్ డాలర్లను దాటింది. ఇంధనం, ఆహార భద్రత వంటి రంగాల్లో ఈ బంధం వ్యూహాత్మకంగా ఉందని రాయబారి అభివర్ణించారు. పర్యాటకం ద్వారా ప్రజల మధ్య సంబంధాలు పెరగడం వల్ల ఈ భాగస్వామ్యం మరింత బలపడుతుందని ఆయన అన్నారు.




# బల్క్ డిపాజిట్లకు కొత్త నిబంధనలు: ఆర్‌బీఐ




బ్యాంకుల్లో రూ.3 కోట్లు, అంతకంటే ఎక్కువ మొత్తంలో చేసే బల్క్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)కు వడ్డీ రేట్ల వర్తింపుపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. అక్టోబరు 1 నుంచి అమల్లోకి రానున్న నిబంధనల ప్రకారం బ్యాంకులు ప్రతి రోజూ ఉదయం 10:10 గంటల్లోపు తమ అధికారిక వెబ్‌సైట్లలో రోజువారీ వడ్డీ రేట్లను ప్రకటించాలి. ఒకే రోజున జమ చేసే సమాన వ్యవధి బల్క్ డిపాజిట్లకు, బ్యాంకు ఏ శాఖలోనైనా ఒకే రకమైన వడ్డీ రేటు వర్తింపజేయాలి. ఎల్‌సీఆర్, రన్‌ఆఫ్ రేటు ఆధారంగా దేశీయ, ఎన్ఆర్ఐ రూపాయి బల్క్ డిపాజిట్ల వడ్డీ రేట్లలో మార్పులు చేసుకునే వెసులుబాటును బ్యాంకులకు ఆర్‌బీఐ కల్పించింది.

# హైదరాబాద్‌లో రాపిడో ఫుడ్ డెలివరీ సేవలు

స్విగ్గీ, జొమాటోకు పోటీగా ఫుడ్ డెలివరీ సేవల విభాగంలో అడుగుపెట్టిన రాపిడో.. తన 'ఓన్లీ' సేవలను హైదరాబాద్‌కూ విస్తరించింది. ఇప్పటివరకు కేవలం బెంగళూరుకు మాత్రమే పరిమితమైన ఈ సేవల్ని భాగ్యనగరంలోనూ అందుబాటులోకి తెచ్చింది. రాపిడో యాప్‌తో పాటు ఓన్లీని ఆండ్రాయిడ్, ఐఓఎస్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఫుడ్ ఆర్డర్ చేయొచ్చు. ఇతర ప్లాట్‌ఫామ్‌ల మాదిరిగా కాకుండా.. ఓన్లీ జీరో కమీషన్ మోడల్‌ను అనుసరిస్తోంది. ప్రతిగా రెస్టరంట్ల నుంచి సబ్‌స్క్రిప్షన్ ఫీజు వసూలు చేస్తోంది. ప్రస్తుతం 22 వేల రెస్టరంట్లతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఓన్లీ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఇప్పటివరకు 42 లక్షల ఆర్డర్లను డెలివరీ చేసినట్లు తెలిపింది. ప్యాకేజింగ్ ఫీజు, ప్లాట్‌ఫామ్ ఫీజు, సర్జ్ ఛార్జీలు వంటివేవీ తమ ప్లాట్‌ఫామ్‌పై ఉండవని చెబుతోంది. జీరో కమీషన్ మోడల్ వల్ల రెస్టరంట్లు విక్రయించిన మొత్తం వారికే చెందుతుందని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్లాట్‌ఫామ్‌కు ఎలాంటి కమీషన్ చెల్లించాల్సి అవసరం లేదని తెలిపింది. వినియోగదారులు కూడా మెనూ ధరకు అదనంగా డెలివరీ ఛార్జీ చెల్లిస్తే సరిపోతుందని పేర్కొంది. బెంగళూరులో తమ ప్లాట్‌ఫామ్‌కు మంచి ఆదరణ లభించిందని, హైదరాబాద్‌లోనూ అదే స్థాయిలో ఉంటుందని భావిస్తున్నట్లు కంపెనీ సహ వ్యవస్థాపకుడు




అరవింద్ పేర్కొన్నారు. ఫుడ్ ఆర్డర్ల డెలివరీకి రాపిడో తన కెప్టెన్ నెట్‌వర్క్‌ను వినియోగించుకోనుంది.

# ఇథనాల్ వినియోగంతో రైతులకు మెరుగైన ఆదాయం: గడ్కరీ

భోపాల్: ఇథనాల్ వాడకం రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, పెట్రోలియం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు సహాయపడుతుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాలని, ప్రజా రవాణాను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్‌లో నూతన బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో గడ్కరీ మాట్లాడారు. రైతులంటే ఈ రోజుల్లో అన్నదాత మాత్రమే కాదని.. 'ఇంధన దాత'లని గడ్కరీ అభివర్ణించారు. ఇథనాల్ ఉత్పత్తి



వల్ల రైతులకు మేలు చేకూరిందన్నారు. దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి ప్రారంభమయ్యాక మొక్కజొన్న క్వింటాల్ ధర రూ.1200 నుంచి రూ.2,600కు చేరిందన్నారు. ఫ్లెక్స్ ఫ్యూయల్ కలిగిన ఇంజిన్లు నూరు శాతం ఇథనాల్‌తో నడుస్తాయని చెప్పారు. ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్నాయన్నారు. భారత్ రూ.22 లక్షల కోట్ల పెట్రోలియంను దిగుమతి చేసుకుంటోందని గడ్కరీ ఈ సందర్భంగా తెలిపారు. ఇథనాల్, ఎలక్ట్రిసిటీ, హైడ్రోజన్, ఇతర ప్రత్యామ్నాయ ఇంధన వాడకాన్ని పెంచి దీన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, హైడ్రోజన్ సాయంతో నడిచే వాహనాలూ అందుబాటులోకి రానున్నాయని గడ్కరీ చెప్పారు. కాలుష్యం పరంగా రవాణా రంగం వాటా గణనీయంగా ఉందని, అందుకే ప్రజా రవాణాను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు.

# పీఎల్ఐతో బల్క్ డ్రగ్స్‌కు ఊతం

దిల్లీ: ఔషధ ముడిపదార్థాల (బల్క్ డ్రగ్స్) ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద ఈ ఏడాది జూన్ నాటికి రూ.5,210.74 కోట్ల పెట్టుబడులు నమోదయ్యాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 28 రకాల క్రిటికల్ ఏపీఐలకు సంబంధించి మొత్తం 39 ప్రాజెక్టులు వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించాయి. 2020లో రూ.6,940 కోట్ల మొత్తం బడ్జెట్ కేటాయింపులతో, బల్క్ డ్రగ్స్ పీఎల్ఐ పథకానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఔషధ రంగ తయారీ సామర్థ్యాలను పెంచేందుకు, అత్యవసర మందుల తయారీకి వాడే క్రిటికల్ ఏపీఐల సరఫరాలో అంతరాయాలు కలగకుండా చూసేందుకు ఈ పథకాన్ని ఉద్దేశించారు. పీఎల్ఐ కింద వైద్య పరికరాల రంగాన్ని ప్రోత్సహించేందుకు రసాయనాలుఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫార్మాస్యూటికల్స్ విభాగం విస్తృత చర్యలు తీసుకుంటోంది. ఈ పథకం దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించిందని, అధునాత సాంకేతికతను స్వీకరించేలా ప్రోత్సహించిందని ప్రభుత్వం వివరించింది.

**5,217 ఉద్యోగాలు**

2026 జూన్ నాటికి బల్క్ డ్రగ్స్ పీఎల్ఐ లబ్ధిదారులు రూ.3,792 కోట్ల విక్రయాలు సాధించారని, ఇందులో రూ.560.16 కోట్ల ఎగుమతులూ ఉన్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ పథకం ద్వారా 5,217 మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు లభించాయి. యాంటీబయోటిక్స్, గుండె సంబంధిత ఔషధాలు, పారాసిటమాల్ వంటి అత్యవసర మందుల ఉత్పత్తికి అవసరమయ్యే ముడి పదార్థాల తయారీని 5 కొత్త (గ్రీన్‌ఫీల్డ్) ప్రాజెక్టులు ప్రారంభించాయి.

**తెలుగు రాష్ట్రాల్లో**

**అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ లైఫియస్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ ఎస్ఈజెడ్‌లో భారీ పెన్సిలిన్-జి తయారీ ప్లాంటు ఏర్పాటు చేసింది. రూ.2,270.05 కోట్ల పెట్టుబడితో చేపట్టిన ఈ ప్రాజెక్టు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 15,000 మెట్రిక్ టన్నులు.**

విర్కో లేబొరేటరీస్ పూర్తి అనుబంధ సంస్థ ఆంధ్ర ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఏఓఎల్) ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరంలో సల్ఫాడయాజిన్, టెల్మిసార్టన్, ఓల్మెసార్టన్ తయారీ యూనిట్లను అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్రాజెక్టుల్లో రూ.151.47 కోట్ల పెట్టుబడి పెట్టి, 221 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలను ఇచ్చింది.

**ఇతర ప్రాంతాల్లో**

డీపీబీ గ్రూపు సంస్థ కిన్వాన్ ప్రైవేట్ లిమిటెడ్ హిమాచల్ ప్రదేశ్‌లోని నలాగఢ్‌లో క్లావులానిక్ యాసిడ్ (పొటాషియం క్లావులనేట్) తయారీకి ఏడాదికి 400 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో



ఫర్మెంటేషన్ ఆధారిత యూనిట్‌ను ప్రారంభించింది. రూ.504.68 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన ఈ ప్రాజెక్టు ద్వారా 465 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించింది. ఈ ప్లాంట్ రూ.413 కోట్ల ఉత్పత్తిని నమోదు చేసింది. గుజరాత్‌లోని దహేజ్‌లో మేఘమణి ఎల్ఎల్‌పి రూ.60.46 కోట్ల వ్యయంతో ఏడాదికి 13,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పారా అమినో ఫినాల్ తయారీ ప్లాంటు నెలకొల్పింది. పంజాబ్‌లోని నవాంశహర్‌లో సెంట్రియంట్ ఫార్మాస్యూటికల్స్ ఇండియా, ఏడాదికి 206 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో అటోర్వాస్టాటిన్ ఏపీఐ గ్రీన్‌ఫీల్డ్ ప్లాంటును తీసుకొచ్చింది. రూ.161.13 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన ఈ ప్రాజెక్టు రూ.432 కోట్ల ఉత్పత్తిని సాధించింది.

* **ఫార్మాస్యూటికల్స్‌లో 1.21 లక్షల ఉద్యోగాలొచ్చాయ్**

రూ.15,000 కోట్ల మొత్తం కేటాయింపులతో 2021లో ఫార్మాస్యూటికల్స్ పీఎల్ఐ పథకం వచ్చింది. తయారీ సామర్థ్యాలను పెంచడం, పెట్టుడులు, ఉత్పత్తిని విస్తరించడం, అధిక విలువ కలిగిన ఔషధాల ఉత్పత్తి వైపు మళ్లడాన్ని ప్రోత్సహించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం.

# బుల్లెట్ దిగింది.. షూటింగ్‌లో భారత్‌కు తొలి పసిడి

* **మెరిసిన సురుచి, కమల్‌జీత్ జోడీ**
* **ఫైనల్లో కబడ్డీ జట్లు**

ఆసియా క్రీడల్లో భారత్‌కు రెండో స్వర్ణం. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో సురుచి సింగ్, కమల్‌జీత్ జోడీ విజేతగా నిలిచింది. వ్యక్తిగత విభాగంలో పేలవ ప్రదర్శన నుంచి తేరుకుంటూ అదిరే ప్రదర్శన చేసిన ఈ ద్వయం 484.6 స్కోరుతో ఫైనల్లో అగ్రస్థానంలో నిలిచింది. దక్షిణ కొరియాకు చెందిన సుహియాన్ హాంగ్, గ్వెన్ చూ జంట (478.0) రజతం నెగ్గగా.. 415.8 స్కోరుతో ఇరాన్ ద్వయం కాంస్య పతకం చేజిక్కించుకుంది. అంతకుముందు సురుచి, కమల్‌జీత్ జంట క్వాలిఫికేషన్ రౌండ్లో సత్తా చాటింది. 587 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచింది. తొలి సిరీస్‌లో 196 స్కోరు చేసిన ఈ జంట.. ఆ తర్వాత వరుసగా 195, 196 పాయింట్లు సాధించింది. 10మీ ఎయిర్ పిస్టల్‌లో ఈ ఈవెంట్ భారత్‌కు చివరిది కావడం విశేషం. ఈ విభాగంలో అంతకుముందు మన జట్టు విఫలమైంది. అంచనాలకు అందుకోలేకపోయింది. వ్యక్తిగత విభాగాల్లో కమల్‌జీత్, సురుచి ఫైనల్ చేరుకోలేకపోయారు. పురుషుల ఈవెంట్లో కమల్‌జీత్ 9వ స్థానంలో నిలవగా.. మహిళల్లో సురుచి 26వ స్థానానికి పరిమితమైంది. ఆసక్తికర విషయమేంటంటే మిక్స్‌డ్‌లో చివరి నిమిషంలో చేసిన మార్పు భారత్‌కు బంగారాన్ని అందించింది. నిజానికి సురుచికి కమల్‌జీత్ జోడీ కాదు. సురుచి భాగస్వామి కేదార్‌లింగ్ ఉచగాన్వె పేలవ ఫామ్‌లో ఉండడంతో అనూహ్యంగా జాతీయ రైఫిల్ సంఘం.. ఆమెకు జోడీగా కమల్‌జీత్‌ను బరిలోకి దించింది. అనేక నిరాశజనక ప్రదర్శనల అనంతరం ఈ స్వర్ణం భారత షూటింగ్ బృందానికి గొప్ప ఉపశమనాన్నిచ్చిందనడంలో సందేహం లేదు. మరోవైపు శుక్రవారం షూటింగ్‌లో భారత్‌కు మరో పతకం కూడా దక్కింది. ఐశ్వరీ ప్రతాప్ సింగ్, రుద్రాంక్ష్ పాటిల్, నీరజ్ కుమార్ త్రయం పురుషుల 50మీ రైఫిల్ 3 పొజిషన్‌లో రజతం సాధించింది. ఈ జట్టు 1762 స్కోర్‌తో రెండో స్థానంలో నిలిచింది. చైనా జట్టు (1766) స్వర్ణం నెగ్గగా.. కొరియా జట్టు (1751) కాంస్యం సొంతం చేసుకుంది. మూడో స్థానంతో ఐశ్వరీ (589), నాలుగో స్థానంతో నీరజ్ (588) వ్యక్తిగత ఫైనల్‌కూ అర్హత సాధించారు. కానీ






ఫైనల్లో వాళ్లు విఫలమయ్యారు. ఐశ్వరీ అయిదో స్థానంతో, నీరజ్ ఎనిమిదో స్థానంతో ముగించారు. షూటింగ్‌లో ఇప్పటిదాకా భారత్ ఒక స్వర్ణం, అయిదు రజతాలు, మూడు కాంస్యాలు నెగ్గింది.

**మెరిసిన గుల్వీర్**

పురుషుల 10000 మీటర్ల పరుగులో గుల్వీర్ సింగ్ రజతం గెలుచుకున్నాడు. అతడు 28 నిమిషాల 29.38 సెకన్లలో లక్ష్యానికి చేరుకున్నాడు. కేవలం 1.87 సెకన్ల తేడాతో స్వర్ణ పతక విజేత బిర్హాను బలేవ్ (బహ్రెయిన్) వెనుక నిలిచాడు. గుల్వీర్ 2023 ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించాడు.

**మానుష్, దియా జోడీకి కాంస్యం**

టేబుల్ టెన్నిస్‌లో మానుష్ షా, దియా చితాలె జంట కాంస్య పతకం చేజిక్కించుకుంది. మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్లో ఈ ద్వయం 811, 511, 811, 211 (04)తో చైనాకు చెందిన వాంగ్ చుకిన్, సన్ యింగ్షా ద్వయం చేతిలో పరాజయం పాలైంది. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్లో మానుష్‌దియా జోడీ 31తో ప్రపంచ నంబర్ 4 జంట దూ హోయ్ కెమ్‌వాంగ్ చున్ తింగ్ (హాంకాంగ్)లకు షాకివ్వడం ద్వారా పతకాన్ని ఖాయం చేసుకుంది.

**మన్‌ప్రీత్ జోరు**

మహిళల షాట్‌పుట్‌లో మన్‌ప్రీత్ కౌర్ కాంస్య పతకం గెలుచుకుంది. ఆమె గుండును 17.17 మీటర్ల దూరం విసిరింది. చైనాకు చెందిన సంగ్ జియాన్ (19.40మీ), జాంగ్ లిను (18.14మీ) స్వర్ణం, రజతాలు సొంతం చేసుకున్నారు. 36 ఏళ్ల మన్‌ప్రీత్ 2023 ఆసియా క్రీడల్లో అయిదో స్థానంలో నిలిచింది.

**బరానికా అదరహో..**

ఆసియా క్రీడల పోల్‌వాల్ట్‌లో పతకం సాధించిన భారత తొలి ప్లేయర్‌గా బరానికా ఎలన్‌గోవన్ ఘనత సాధించింది. ఆమె 4.15 మీటర్ల ఎత్తు ఎగిరి మూడో స్థానంలో నిలిచింది. కజకిస్థాన్‌కు చెందిన పోలినా ఇవనోవా (4.15మీ)తో ఆమె ఈ పతకాన్ని పంచుకుంది. ఈ సీజన్‌లో బరానికా అత్యుత్తమ ప్రదర్శన 4.23 మీటర్లు. కబడ్డీలో హవా: కబడ్డీలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ రెండు స్వర్ణాలకు చేరువైంది. పురుషులు, మహిళల విభాగాలు రెండింటిలోనూ భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. పురుషుల జట్టు 6628తో థాయ్‌లాండ్‌ను మట్టికరిపించగా..మహిళల జట్టు



4824తో నేపాల్‌ను చిత్తు చేసింది. క్వార్టర్స్‌లో సచిన్: బాక్సింగ్‌లో సచిన్ సివాచ్ పతకానికి అడుగు దూరంలో నిలిచాడు. పురుషుల 60 కేజీల విభాగంలో అతడు క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్స్‌లో సచిన్ 41తో మహ్మద్ అద్నన్ (జోర్డాన్)ను ఓడించాడు. క్వార్టర్స్‌లో కిటోమోటో (జపాన్)పై గెలిస్తే.. సచిన్ పతకం ఖాయం చేసుకుంటాడు. గత ఆసియా క్రీడల్లో కాంస్యం నెగ్గిన ప్రీతి పవార్ కథ ముగిసింది. మహిళల 54 కేజీల రెండో రౌండ్లో ఆమె 05తో చోల్ (ఉత్తర కొరియా) చేతిలో ఓడింది.

**హాకీలో నాలుగో విజయం**

హాకీలో భారత అమ్మాయిల జోరు కొనసాగుతోంది. దూకుడు కొనసాగిస్తూ సలీమా బృందం వరుసగా నాలుగో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. శుక్రవారం భారత్ 31తో బలమైన జపాన్‌ను ఓడించి దాదాపు సెమీఫైనల్ బెర్తు ఖాయం చేసుకుంది. లాల్రెమ్‌సియామి (5వ నిమిషం), ఇషిక చౌదరి (30వ), నవ్‌నీత్ కౌర్ (36వ) ఒక్కో గోల్ చేశారు. జపాన్ తరఫున ఏకైక గోల్‌ను షిషో కొబయకవా (46వ) సాధించింది. ఆదివారం తన ఆఖరి లీగ్‌లో సింగపూర్‌తో భారత్ తలపడనుంది.

**సెమీస్‌పై భారత్ కన్ను**

హాకీలో ఒలింపిక్ బెర్తే లక్ష్యంగా బరిలో దిగి.. వరుస విజయాలతో అదరగొడుతున్న భారత పురుషుల జట్టు మరో కీలక సమరానికి సిద్ధమైంది. పూల్ ఎ ఆఖరి మ్యాచ్‌లో శనివారం ఆతిథ్య జపాన్‌తో హర్మన్‌ప్రీత్ సేన తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సెమీఫైనల్ బెర్తు దక్కించుకోవాలని భారత్ పట్టుదలగా ఉంది. ఇప్పటిదాకా జరిగిన మ్యాచ్‌ల్లో ఇండోనేసియాపై 131తో, శ్రీలంకపై 161తో, కొరియాపై 82తో భారత్ గెలిచింది. జపాన్ కూడా హ్యాట్రిక్ విజయాలతో జోరు మీదుంది.

**స్క్వాష్‌లో 3 పతకాలు ఖాయం**

స్క్వాష్‌లో భారత్‌కు మూడు పతకాలు ఖాయమయ్యాయి. జోష్న చిన్నప్ప, వేలవన్ జంట మిక్స్‌డ్ డబుల్స్‌లో.. అనాహత్, అభయ్ సింగిల్స్‌లో సెమీస్ చేరారు. క్వార్టర్స్‌లో జోష్న జోడీ 113, 115తో పెలినో, అరిబాదో (ఫిలిప్పీన్స్) ద్వయాన్ని ఓడించింది. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో అనాహత్ 112, 115, 113తో తన్వి ఖన్నాపై గెలిచింది.




# సాత్విక్ జోడీకి షాక్

* **తొలి రౌండ్లోనే ఔట్**

నగోయా: ఆసియా క్రీడల్లో బ్యాడ్మింటన్‌లో భారత్‌కు అతి పెద్ద షాక్. స్వర్ణం తెస్తుందనే అంచనాలతో టోర్నీలో అడుగుపెట్టిన సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి జోడీ తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలో దిగిన సాత్విక్‌చిరాగ్ ద్వయం 2112, 1921, 1421తో పకాపోన్‌పీరాట్‌చాయ్ (థాయ్‌లాండ్) జంట చేతిలో అనూహ్యంగా కంగుతింది. తొలి గేమ్ తేలిగ్గా గెలిచి జోరు మీద కనిపించిన భారత జంట.. తర్వాత తడబడింది. రెండో గేమ్‌లో సాత్విక్ జోడీ ఆరంభంలో బాగానే ఆడినా.. తర్వాత పట్టు సడలించింది. దీంతో విరామ సమయానికి 11 9తో ఆధిక్యంలో నిలిచిన థాయ్ జంట.. ఆపై గేమ్ గెలిచి స్కోరు సమం చేసింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సాత్విక్ జోడీది అదే ఆట. మొదట దూకుడుగా ఆడిన భారత ద్వయం.. తర్వాత వెనుకబడి ఆపై ఓటమి వైపు నిలిచింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్‌ట్రీసా జాలీ జంట శుభారంభం చేసింది.. తొలి రౌండ్లో గాయత్రి జోడీ 2116, 1621, 2116తో హి యాన్ సాంగ్‌లుక్ లుక్ (హాంకాంగ్) జంటను ఓడించింది. కవిప్రియ సిమ్రన్ ద్వయం 921, 521తో ఫెబ్రియానా ట్రియాస్ (ఇండోనేసియా) జంట చేతిలో ఓడగా..




మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టోధ్రువ్ కపిల ద్వయం క్వార్టర్స్ చేరింది. ప్రిక్వార్టర్స్‌లో తనీషా జంట 218, 217తో నిబాల్‌నబీహా (మాల్దీవులు) జోడీపై గెలిచింది.

**స్విమ్మింగ్, ఫెన్సింగ్‌లో నిరాశ**

స్విమ్మింగ్‌లో భారత్‌కు నిరాశ తప్పలేదు. పురుషుల 200 మీటర్ల బటర్‌ఫ్లైలో సాజన్ ప్రకాశ్ 1 నిమిషం 58.42 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ఏడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో రిషబ్ దాస్ (1 నిమిషం 58.77 సెకన్లు), ఉత్కర్ష్ పటేల్ (2 నిమిషాల 94 సెకన్లు) వరుసగా ఆరు, ఏడో స్థానాల్లో నిలిచారు. ఫెన్సింగ్‌లో భారత పురుషుల ఫోయిల్, మహిళల ఇపీ జట్లు ముందంజ వేయలేకపోయాయి.

# రెండో వన్డేలో లంక గెలుపు

లీడ్స్: ఇంగ్లాండ్ పర్యటనలో శ్రీలంక ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. శుక్రవారం రెండో వన్డేలో ఆతిథ్య జట్టుపై 16 పరుగుల తేడాతో గెలిచిన లంక.. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 11తో సమం చేసింది. కెప్టెన్ కుశాల్ మెండిస్ (121; 118 బంతుల్లో 14×4, 3×6) సెంచరీతో చెలరేగడంతో మొదట శ్రీలంక 6 వికెట్లకు 321 పరుగులు సాధించింది. కమిందు మెండిస్ (54), పవన్ రత్నాయకే (48) రాణించారు. ఛేదనలో ఇంగ్లాండ్.. 9 వికెట్లకు 305 పరుగులు చేసింది. ఓపెనర్లు బాంటన్ (73), డకెట్ (67) అదరగొట్టినా.. వెల్లలాగె (3/49), మధుశంక (2/54), ఇషాన్ మలింగ (2/50) విజృంభించి లంకను గెలిపించారు. టీ20 సిరీస్‌లో 03తో లంక వైట్‌వాష్ అయిన సంగతి తెలిసిందే.



## భావోద్వేగాల సమ్మేళనంగా సిగ్మా

'ఇందులో రేడియో జాకీలా కనిపిస్తా. మంచి ఎమోషనల్ క్యారెక్టర్ నాది. అన్ని రకాల ఎమోషన్స్‌నీ ఇందులో ప్రజెంట్ చేశాను. మంచి యాక్షన్ అడ్వెంచర్ కామెడీ సినిమా ఇది. ఫ్యామిలీతో కలిసి హాయిగా చూడొచ్చు' అని ఫరియా అబ్దుల్లా అన్నారు. సందీప్‌కిషన్ కథానాయకుడిగా జేసన్ సంజయ్ దర్శకత్వంలో రూపొందిన 'సిగ్మా' చిత్రంలో ఫరియా కథానాయిక. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈచిత్రం అక్టోబర్ 2న విడుదల కానున్నది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఫరియా అబ్దుల్లా విలేకరులతో మాట్లాడారు. 'సందీప్‌కిషన్, నేనూ కలిసి ఎప్పట్నుంచో ఓ సినిమా చేయాలనుకుంటున్నాం. ఫైనల్‌గా సిగ్మాతో కుదిరింది. జూమ్ కాల్‌లో జేసన్ ఈ కథ చెప్పారు. కథ విన్న తర్వాత ఆయన్ను 'వయసెంత?' అనడిగాను. 24ఏళ్లని చెప్పారు. నాకు చాలా ఇన్‌స్పైరింగ్‌గా అనిపించింది. ఒక సూపర్‌స్టార్ కొడుకు అనే ఫీలింగ్ ఆయనలో మచ్చుకైనా కనిపించదు. వినయంగా, ఫ్రెండ్లీగా ఉంటారు. తొలి సినిమా అయినప్పటికీ ఎంతో క్లారిటీగా, విజన్‌తో సినిమా తీశారు' అని తెలిపింది ఫరియా అబ్దుల్లా. 'సిగ్మా' లాంటి మంచి ప్రాజెక్ట్‌తో తమిళంలో ఎంట్రీ ఇవ్వడం ఆనందంగా ఉందని, తమన్ బీజీఎం, పాటలు నెక్స్ట్ లెవెల్లో ఉంటాయని ఫరియా పేర్కొన్నది.

## విలన్లపై విరుచుకుపడే వయొలెంట్ డాక్టర్?



అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో రజనీకాంత్ చేస్తున్న 'ధర్మన్' సినిమాలో తొలిసారి తలైవా డెడ్లీ డాక్టర్‌గా కనిపించబోతున్నారు. ప్రస్తుతం కోలీవుడ్‌లో ఈ సినిమాలోని ఆయన పాత్ర తీరుతెన్నులపై ఇప్పటికే రకరకాల కథనాలు వెలువడుతున్నాయి. సర్జికల్ స్కాల్పెల్‌తో ఆపరేషన్ థియేటర్‌లోనే విలన్లపై విరుచుకుపడే వయొలెంట్ డాక్టర్‌గా ఇందులో రజనీకాంత్ కనిపిస్తారట. ఓ వైపు మృదుస్వభావిగా రోగులకు వైద్యం చేస్తూ, మరోవైపు నేరస్థుల పాలిట కాలయముడిగా రజనీకాంత్ క్యారెక్టరైజేషన్ ఉంటుందని తెలుస్తున్నది. ఈ సినిమాలో రజనీ కేవలం డాక్టర్‌గానే కాక, విద్యార్థులకు చదువు చెప్పే ప్రొఫెసర్‌గా కూడా కనిపిస్తారట. రజనీకాంత్ కెరీర్‌లోనే ఈ తరహా పాత్ర చేయడం ప్రథమమని చిత్రబృందం చెబుతున్నది. సూపర్‌స్టార్ అభిమానులకు ఈ సినిమా ఓ విజువల్ ఫీస్ట్‌లా ఉండబోతున్నదని సమాచారం. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఈ సినిమాను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఆయన ఓ ప్రత్యేక పాత్రలో కనిపిస్తారని వినికిడి.

## చిట్టి గౌనులో గ్లామర్



బుల్లితెరపై తన నటనతో, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో విశేషమైన అభిమాన గణాన్ని సంపాదించుకున్న నటి తేజస్విని గౌడ. ప్రముఖ బుల్లితెర నటుడు, బిగ్ బాస్ ఫేమ్ అమర్‌దీప్ చౌదరి భార్యగా కూడా ఆమె తెలుగు ప్రేక్షకులకు బాగా సుపరిచితురాలు. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే తేజస్విని, తన లేటెస్ట్ ఫొటోషూట్‌లు, పర్సనల్ లైఫ్ విశేషాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. ఈ క్రమంలోనే తేజస్విని ఇటీవల పర్పుల్ కలర్ మోడర్న్ గౌనులో చేసిన ఫొటోషూట్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. సంప్రదాయ చీరకట్టులో ఎంతో పద్ధతిగా కనిపించే ఈ చిన్నది, ఈ రకమైన వెస్టర్న్ అవుట్‌ఫిట్‌లో చాలా క్యూట్‌గా, గ్లామరస్‌గా దర్శనమిచ్చింది. లూజ్ హెయిర్, సింపుల్ మేకప్, ఆకట్టుకునే నవ్వుతో ఇచ్చిన భంగిమలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఒకవైపు ట్రెడిషనల్ వేర్‌లో పద్ధతిగా కనిపిస్తూనే, మరొకవైపు వెస్టర్న్ గౌన్లలో ఎంతో అందంగా మెరిసిపోతూ ఫ్యాన్స్ హృదయాలను కొల్లగొడుతోంది. ఈ లేటెస్ట్ క్యూట్ పిక్స్ చూసిన అభిమానులు, నెటిజన్లు "బ్యూటిఫుల్", "చాలా క్యూట్‌గా ఉన్నారు" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళంలోనూ మంచి క్రేజ్ ఉన్న తేజస్విని, తమిళ టెలివిజన్ పరిశ్రమలో పలు ప్రముఖ సీరియళ్లలో నటించి మెప్పించారు. ముఖ్యంగా జీ తమిళం ఛానల్‌లో ప్రసారమైన 'విద్యా రాణి' సీరియల్ ఆమెకు తమిళంలో విశేషమైన గుర్తింపును తెచ్చిపెట్టింది. ఇందులో శీర్షికా పాత్ర (టైటిల్ రోల్) పోషించిన తేజస్విని, తన నటనలోని భావోద్వేగాలు, సహజత్వంతో తమిళ ఇళ్లల్లో కుటుంబ ప్రేక్షకులను అలరించారు. తమిళ ప్రాజెక్ట్‌లతో పాటు అమర్‌దీప్ చౌదరితో వివాహం తర్వాత కూడా తన నటనను కొనసాగిస్తూ సోషల్ మీడియాలోనూ నిత్యం యాక్టివ్‌గా ఉంటారు. డిఫరెంట్ రోల్స్ ఎంచుకుంటూ తమిళ, తెలుగు నాట సమానమైన ప్రజాదరణ పొందుతూ బుల్లితెరపై విజయవంతంగా దూసుకుపోతున్నారు. కన్నడ, తెలుగు, తమిళ భాషల్లో వరుస ఆఫర్లు పొందుతూ సౌత్ ఇండియన్ టెలివిజన్ రంగంలో లీడింగ్ నటీమణులలో ఒకరిగా పేరు గాంచారు.



## ఓటీటీలోకి వచ్చేస్తున్న నయనతార లేటేస్ట్ మూవీ

లేడీ సూపర్ స్టార్ నయనతార, యువ నటుడు కవిన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన తాజా రొమాంటిక్ కామెడీ డ్రామా 'హాయ్'. ఆగస్ట్ 28న థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు మిశ్రమ స్పందన వచ్చింది. ఇదిలా ఉంటే.. బాక్సాఫీస్ వద్ద సందడి చేసిన కొన్ని రోజులకే ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ఓటీటీ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ చిత్రం డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ 'జీ5' సొంతం చేసుకుంది. ఈ క్రమంలో ఈ సినిమా ఓటీటీ రిలీజ్ డేట్‌ను సంస్థ అధికారికంగా ప్రకటించింది. విష్ణు ఎడవన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ సెప్టెంబర్ 25 నుంచి ప్రముఖ ఓటీటీ వేదికైన 'జీ5'లో స్ట్రీమింగ్ కానుంది. "మీకు ఇష్టమైన రొమాంటిక్ రైడ్‌కి 'హాయ్' చెప్పడానికి సిద్ధంగా ఉండండి" అంటూ సోషల్ మీడియా ద్వారా ఈ వార్తను జీ5 సంస్థ వెల్లడించింది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన వారికి, మళ్లీ చూడాలనుకునే వారికి ఇది మంచి అవకాశమని చెప్పవచ్చు.

## దసరా, హిట్ 3 రికార్డులు బద్దలు..

### నాని కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్ కొట్టిన ప్యారడైజ్



నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కిన లేటెస్ట్ మూవీ ది ప్యారడైజ్ బాక్సాఫీస్ దగ్గర భారీ ఓపెనింగ్ అందుకుంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రిలీజ్‌కు ముందు నుంచే అడ్వాన్స్ బుకింగ్స్‌తో హైప్ క్రియేట్ చేసిన ఈ సినిమా.. తొలిరోజు వసూళ్లలోనూ తన సత్తా చాటింది. తాజా సమాచారం ప్రకారం ది ప్యారడైజ్ ఇండియాలో తొలిరోజు ఇప్పటివరకు రూ.34.65 కోట్ల నెట్ వసూళ్లు సాధించిందని తెలుస్తుంది.

ఈ కలెక్షన్స్ ఇంకా ఫైనల్ కాకపోవడంతో ఫస్ట్ డే పూర్తయ్యే సమయానికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ది ప్యారడైజ్ తొలి రోజు వసూళ్లు నాని గత సినిమాల ఓపెనింగ్ రికార్డులను దాటేశాయి. ఇప్పటివరకు నాని కెరీర్‌లో మంచి ఓపెనింగ్స్ అందుకున్న దసరా, హిట్: 3 కేస్ సినిమాలను కూడా ఈ మూవీ దాటేసింది.

దసరా తొలిరోజు సుమారు రూ.23.20కోట్ల వసూళ్లు సాధించగా, హిట్: 3 కేస్' ఫస్ట్ డే దాదాపు రూ.21 కోట్ల రేంజ్‌లో వసూళ్లు రాబట్టింది. ఈ నేపథ్యంలో ది ప్యారడైజ్ ఓపెనింగ్ నానికి కొత్త బెంచ్‌మార్క్‌గా నిలిచింది. ది ప్యారడైజ్‌కు తెలుగు మార్కెట్‌లోనే అత్యధిక రెస్పాన్స్ లభించిందని తెలుస్తుంది. తాజాగా సమాచారం ప్రకారం తెలుగు వెర్షన్ ద్వారా రూ.25.10కోట్ల నెట్ వసూళ్లు నమోదయ్యాయి. హిందీలో రూ.1.82 కోట్లు, తమిళంలో రూ.1.02కోట్లు నెట్ కలెక్షన్స్ వచ్చినట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో నాని క్రేజ్, భారీ థియేట్రికల్ రిలీజ్, ముందస్తు బుకింగ్స్ సినిమాకు భారీ ఓపెనింగ్ రావడానికి రిలీజ్‌కు ముందే 'ది ప్యారడైజ్' అడ్వాన్స్ బుకింగ్స్ భారీ స్థాయిలో నమోదయ్యాయి.

దసరా తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన సినిమా కావడంతో ది ప్యారడైజ్ పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ స్థాయిలో రూపొందించిన ఈ యాక్షన్ డ్రామాలో నాని పూర్తిగా భిన్నమైన గెటప్‌లో కనిపించారు. రిలీజ్‌కు ముందు అడ్వాన్స్ బుకింగ్స్‌లోనూ ఈ సినిమా మంచి జోరు చూపించింది. ప్రస్తుతం అందుతున్న ఫస్ట్ డే లెక్కలతో నాని కెరీర్‌లోనే ది ప్యారడైజ్ బిగ్గెస్ట్ ఓపెనర్‌గా నిలిచింది. అయితే ఫైనల్ డే1 కలెక్షన్స్ వెల్లడైన తర్వాత ఈ రికార్డు సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.